RNI NO. TELTEL/2022/83470
manasakshi.in
మనసాక్షి
మీకోసం
తెలుగు దినపత్రిక
ఎడిటర్ : మల్లె నాగిరెడ్డి

## భక్తులతో యాదాద్రి కిటకిట

యాదాద్రిలో ఏకాదశితో పాటు వారాంతపు రోజైన ఆదివారం వివిధ జిల్లాలకు చెందిన భక్తులు చేపట్టిన దైవారాధనలతో ఆధ్యాత్మిక కోలాహలం నెలకొంది.యాదగిరిగుట్ట: యాదాద్రిలో ఏకాదశితో పాటు వారాంతపు రోజైన ఆదివారం వివిధ జిల్లాలకు చెందిన భక్తులు చేపట్టిన దైవారాధనలతో ఆధ్యాత్మిక కోలాహలం నెలకొంది. మందిర వీధులన్నీ భక్తుల సమూహంతో నిండిపోయాయి. ఏకాదశి సందర్భంగా ఆలయ మహాముఖ మండపంలో యజ్ఞ మూర్తులకు లక్ష పుష్పార్చన నిర్వహించారు. పలు విభాగాల ద్వారా స్వామి వారికి రూ.43,61,283 నిత్యాదాయం సమకూరిందని దేవస్థాన ఈవో రామకృష్ణారావు తెలిపారు.



నల్గొండ | హైదరాబాద్ | సంపుటి : 2. సంచిక :106 | సోమవారం 08 జనవరి 2024 | పేజీలు 8 | వెల: రూ.1.00 | epaper.manasakshi.in

# ఆరు గ్యారంటీల అమలుపై పూర్తి దృష్టి

- అమలుకు తదుపరి కార్యాచరణపై కసరత్తు
- ప్రజాపాలన దరఖాస్తులపై నేడు సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష
- ప్రత్యేక వెబ్‌సైట్‌ను ప్రారంభించనున్న ముఖ్యమంత్రి

*శాసనసభ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిచ్చి.. వాటిని వేగంగా అమలు చేసే పనిలో ఉంది. లోక్‌సభ ఎన్నికలు త్వరలోనే ఉండడంతో వీటి అమలుపై పూర్తి దృష్టి సారించనుంది.*



**హైదరాబాద్,మనసాక్షి:** శాసనసభ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిచ్చి.. వాటిని వేగంగా అమలు చేసే పనిలో ఉంది. లోక్‌సభ ఎన్నికలు త్వరలోనే ఉండడంతో వీటి అమలుపై పూర్తి దృష్టి సారించనుంది. ఇందులో భాగంగా ఇప్పటికే ఆరోగ్యశ్రీ బీమా పరిమితిని పెంచడంతోపాటు ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించింది. ఆరు గ్యారంటీల్లోని మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత పథకాలకు గత నెల 28 నుంచి ఈ నెల 6 వరకు ప్రజాపాలన కార్యక్రమం ద్వారా దరఖాస్తులు స్వీకరించింది. వీటిపై తదుపరి కార్యాచరణలో భాగంగా.. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సోమవారం ఉదయం 11 గంటలకు సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, సీఎస్ శాంతికుమారి, అన్ని శాఖల కార్యదర్శులు, ఉమ్మడి జిల్లాలకు ప్రత్యేకంగా నియమించిన నోడల్ అధికారులు, సీజీజీ డైరెక్టర్ జనరల్, జీహెచ్ఎంసీ కమిషనర్ తదితర ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో ప్రజాపాలనపై ప్రత్యేకంగా రూపొందించిన వెబ్‌సైట్ prajapalana.telangana.gov.in ను సీఎం ప్రారంభిస్తారు.

**అర్జీల సమాచారం 17లోగా ఆన్‌లైన్‌లోకి**

ప్రజాపాలనలో భాగంగా రాష్ట్రంలోని 16,392 గ్రామపంచాయతీలు, 710 మున్సిపల్ వార్డుల్లో గ్రామసభలు నిర్వహించారు. పది రోజుల్లో మొత్తం 1,25,84,383 దరఖాస్తులు అందాయి. వీటిలో అయిదు హామీలకు సంబంధించి 1,05,91,636 అర్జీలు రాగా.. ఇతర అభ్యర్థనలకు సంబంధించి 19,92,747 వచ్చాయి. ప్రజల నుంచి అందిన దరఖాస్తులన్నింటినీ ఈ నెల 17 లోగా ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని ప్రభుత్వం ఇప్పటికే అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించింది. ప్రాథమిక సమాచారం ప్రకారం.. మహాలక్ష్మి పథకం కింద నెలకు రూ.2,500 ఆర్థిక సాయం.. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల కోసం అత్యధిక దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు గుర్తించారు. రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్తు, పింఛన్ల పెంపు తదితర హామీల అమలుపై సోమవారం నాటి సమీక్షలో కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం ఏర్పడి 30 రోజులు పూర్తయిన నేపథ్యంలో.. ఇప్పటికే అమలు చేసిన హామీలతో పాటు సత్వరమే అమలు చేయనున్న హామీల గురించి ప్రజలకు వివరించడానికి కార్యాచరణరూపొందించనున్నారు.

## రామమందిర వ్యవహారాన్ని రాజకీయం చేయొద్దు: తమిళిసై



**కోయంబత్తూరు,మనసాక్షి:** అయోధ్యలో రామమందిర కుంభాభిషేక ఆహ్వాన పత్రిక వ్యవహారాన్ని రాజకీయం చేయొద్దని పుదుచ్చేరి ఇన్‌ఛార్జి లెఫ్టినెంట్ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ పేర్కొన్నారు. కోయంబత్తూరులో ఆదివారం జరిగిన పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన ఆమె విమానాశ్రయంలో విలేకరులతో మాట్లాడారు. రామమందిర కుంభాభిషేకం ఆహ్వానానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసిందని, అందులోని సభ్యులు ప్రముఖులను ఆహ్వానిస్తున్నారన్నారు. రాష్ట్రపతి ద్రౌపదిముర్ముకు ఆహ్వానపత్రిక అందజేశారా? లేదా? అనే విషయం తనకు తెలియదన్నారు. కేంద్రంలో నరేంద్రమోదీ సారథ్యంలో అవినీతి రహిత, సుస్థిర పాలన కొనసాగుతుండటం వల్లే చెన్నైలో జరిగే ప్రపంచ పెట్టుబడిదారుల సదస్సుల్లో ప్రముఖ సంస్థలు పాల్గొంటున్నాయని పేర్కొన్నారు. రవాణా కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సత్వరమే చర్యలు చేపట్టాలని తెలిపారు. సహాయ నిధి అందని వరద బాధితుల వివరాలు తెలుసుకుని వెంటనే అందజేసే చర్యలు చేపట్టాలన్నారు.

## లోక్‌సభ స్థానాలకు కాంగ్రెస్ కోఆర్డినేటర్లు వీరే



**న్యూఢిల్లీ,మనసాక్షి:** వచ్చే పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలోని 17 లోక్‌సభ స్థానాలకు కాంగ్రెస్ కోఆర్డినేటర్లను ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నియమించారు. ఈ సమన్వయకర్తల జాబితాను ఆదివారం ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ. వేణుగోపాల్ ఓ ప్రకటనలో విడుదల చేశారు. ఆదిలాబాద్ (ఎస్టీ) సీతక్క, పెద్దపల్లి (ఎస్సీ) డి.శ్రీధర్‌బాబు, కరీంనగర్ పొన్నం ప్రభాకర్, నిజామాబాద్ టి.జీవన్‌రెడ్డి, జహీరాబాద్ టి.సుదర్శనరెడ్డి, మెదక్ దామోదర రాజనరసింహ, మల్కాజిగిరి తుమ్మల నాగేశ్వరరావు, సికింద్రాబాద్ మల్లు భట్టి విక్రమార్క, హైదరాబాద్ మల్లు భట్టి విక్రమార్క, మహబూబ్‌నగర్ రేవంత్‌రెడ్డి, చేవెళ్ల రేవంత్‌రెడ్డి, నాగర్‌కర్నూలు (ఎస్సీ) జూపల్లి కృష్ణారావు, నల్లగొండ ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి, భువనగిరి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, వరంగల్ (ఎస్సీ) కొండా సురేఖ, మహబూబాబాద్ (ఎస్టీ) పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఖమ్మం పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి.



## కేసీఆర్‌కు నరసింహన్ పరామర్శ

**హైదరాబాద్,మనసాక్షి:** తుంటిఎముక మార్పిడి చికిత్స తరువాత హైదరాబాద్ నందినగర్‌లోని తన ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావును మాజీ గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ దంపతులు ఆదివారం మధ్యాహ్నం పరామర్శించారు. ఈ సందర్భంగా నరసింహన్ దంపతులు కేసీఆర్ ఆరోగ్యపరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. కేసీఆర్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ఆవిర్భావం తరువాత జరిగిన అభివృద్ధి, అప్పటి గవర్నర్‌గా నరసింహన్ అందించిన సంపూర్ణ సహకారం చర్చకు వచ్చిన సందర్భంలో కేసీఆర్ వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా నరసింహన్ దంపతులకు పట్టువ స్త్రాలు సమర్పించి సంప్రదాయపద్ధతిలో అతిథి మర్యాదలు చేశారు. అంతకుముందు కేసీఆర్ నివాసానికి నరసింహన్ దంపతులు చేరుకోగానే బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీమంత్రి కె.తారకరామారావు సాదరంగా ఆహ్వానించారు. కేటీఆర్ వెంట మాజీమంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, ఎంపీలు జోగినపల్లి సంతోష్, బీబీ పాటిల్ తదితరులు ఉన్నారు.

# ఒకే కారణంతో 5 రోజుల్లో 50 శాతం పెరిగిన షేరు..



కొత్త సంవత్సరంలో దేశీయ స్టాక్ మార్కెట్లు ఒడుదొడుకులకు లోనవుతున్నాయి. సెన్సెక్స్, నిఫ్టీ ఇవాళ కూడా ప్రస్తుతం నష్టాల్లో ఉన్నాయి. ఇక అనిశ్చితి ఉన్నప్పటికీ కొన్ని పెన్నీ స్టాక్స్ మాత్రం అదరగొడుతున్నాయి. ఊహించని రీతిలో పెరుగుతున్నాయి. ఇప్పుడు అలాంటి ఒక స్టాక్ వరుసగా అప్పర్‌సర్క్యూట్ కొడుతుండటం విశేషం. దిగ్గజ టెక్స్‌టైల్ మానుఫ్యాక్చరర్ అలోక్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ షేరు వరుసగా పుంజుకుంటోంది. ఇన్వెస్టర్లకు అదిరిపోయే రిటర్న్స్ అందిస్తుంది. శుక్రవారం రోజు సెషన్‌లో కూడా ప్రస్తుతం 16 శాతం లాభంతో ట్రేడవుతో ంది. ఇంట్రాడేలో 20 శాతం పుంజుకొని రూ. 32.55 వద్ద జీవన కాల గరిష్టాన్ని కూడా నమోదు చేసింది. తర్వాత ప్రాఫిట్ బుకింగ్ నేపథ్యంలో కాస్త వెనక్కి తగ్గింది. ఈ కంపెనీ షేరు ఒకే ఒక్క కారణంతో దూసుకెళ్తోంది. దీంతో ఇన్వెస్టర్లు పండగ చేసుకుంటున్నారు. ఈ ఏడాది జనవరిలో 5 సెషన్లు ట్రేడింగ్ జరగ్గా.. ఏకంగా 50 శాతం వరకు పెరిగింది. ముకేశ్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఈ కంపెనీలో ప్రిఫరెన్షియల్ షేర్ల సబ్‌స్క్రిప్షన్ పేరిట ఏకంగా రూ. 3300 కోట్ల పెట్టుబడులు పెట్టింది. దీంతో ఇన్వెస్టర్లలో ఆత్మవిశ్వాసం నెలకొంది. ఈ కారణంతో స్టాక్ ముందుకు దూసుకెళ్తూనే ఉంది. కొనుగోళ్లు ఊపందుకున్నాయి. ఈ స్టాక్ రిలయన్స్ పెట్టుబడి ప్రకటన వచ్చిన జనవరి 2న 20 శాతం అప్పర్‌సర్క్యూట్ కొట్టింది. జనవరి 3న 7 శాతం పెరిగింది. జనవరి 4న రెండు శాతం తగ్గింది. మళ్లీ ఇవాళ దాదాపు 20 శాతం పెరిగి తర్వాత తగ్గింది.

ట్రెండింగ్‌లో ఇదే..

రిలయన్స్ కంపెనీ పెట్టుబ డుల నేపథ్యంలో ఈ స్టాక్ ఈ నెలలో 5 రోజుల వ్యవధిలోనే 50 శాతం వరకు పెరిగింది. 3 రోజులు లాభాలు నమోదు చేసింది. 2023 డిసెంబర్ నెలలో 8.6 శాతం పెరిగింది. నవంబర్ నెలలో 13 శాతం పుంజుకుంది. గత ఏడాది కాలంలో చూస్తే ఈ షేరు 74 శాతం పెరగ్గా.. 52 వారాల కనిష్ట ధర రూ. 10.07 నుంచి 212 శాతం పెరిగింది. 2023, ఫిబ్రవరి 22న కనిష్ట విలువను తాకింది. అలోక్ ఇండస్ట్రీస్ కంపెనీ విషయానికి వస్తే.. ముంబయి ప్రధాన కేంద్రం గా టెక్స్‌టైల్ కార్యకలాపాలు నిర్వహిస్తోంది. కాటన్, పాలిస్టర్ సెగ్మెంట్లో బలమైన పోటీదా రుగా ఉంది. స్పిన్నింగ్ నుంచి వేవింగ్ వరకు, ప్రాసెసింగ్, ఫినిష్డ్ ఫాబ్రిక్స్, బెడ్‌షీట్స్, టవల్స్, గార్మెంట్స్ తయారు చేస్తుంది. ఈ కంపెనీ మార్కెట్ విలువ రూ. 15.22 వేల కోట్లుగా ఉంది.

# లక్షను రూ. 5 లక్షలు చేసింది!

స్టాక్ మార్కెట్లలో ఐపీఓలు అద్భుతమైన రిటర్న్స్ ఇస్తాయని చెప్పొచ్చు. మినిమం గ్యారెంటీ రిటర్న్స్ ఇందులో వస్తాయి. గతేడాది ఆఖర్లో డిసెంబర్ సమయంలో చాలా ఐపీఓలు 100 శాతానిక పైగా లాభాలు అందించాయి. ఇప్పుడు కొత్త సంవత్సరంలో ఒక ఐపీఓ లిస్టింగ్‌రోజే 400 శాతానికిపైగా రిటర్న్స్ ఇవ్వడం విశేషం. దీని గురించి తెలుసుకుందాం. స్టాక్ మార్కెట్లలో మీరు పెట్టుబడులు పెడుతున్నారా? సరైన స్టాక్స్ ఎంచుకొని ఒక క్రమపద్ధతిలో పెట్టుబడులు పెడితే దీర్ఘకాలంలో మంచి రిటర్న్స్ ఆశించ వచ్చు. అదే సమయంలో చాలా మంది ఐపీఓలను (ఇనిషియల్ పబ్లిక్ ఆఫరింగ్) నమ్ముకొని పెట్టుబడులు పెడుతుంటారు. వీటిల్లో నిర్దిష్ట మొత్తం పెట్టుబడి పెడితే.. లాట్స్ వస్తాయి. షేరు ధర ముందే నిర్ణయించిన ప్రకారం ఉంటుంది. సబ్‌స్క్రిప్షన్‌ను బట్టి షేరు ధర లిస్టింగ్ రోజే భారీ లాభంతో లిస్టవుతుంటు ంది. 2023 చివర్లో చాలా వరకు ఐపీఓలు ఇన్వెస్టర్లకు డబుల్ రిటర్న్స్ ఇచ్చాయి. వీటిల్లో ఐఆర్ఈడీఏ, టాటా టెక్నాలజీస్ వంటి షేర్లను ఉదాహరణలుగా చెప్పొచ్చు.



ఇప్పుడు అలాంటి ఒక ఐపీఓ మార్కెట్లలో లిస్ట్ కాగా.. ఊహించని రీతిలో లాభాల్ని అందించింది.

అదే కే సీ ఎనర్జీ ఐపీఓ కొత్త ఏడాదిలో పెట్టుబడిదారుల తలరాతనే మార్చేసింది. లిస్టింగ్‌తోనే పెట్టుబడిదారుల సొమ్ము ఏకంగా నాలుగింతలు కావడం విశేషం. ఈ ఐపీఓ కోసం కంపెనీ ఇష్యూ చేసిన షేరు ధర రూ. 54. ఇక ఇవాళ మార్కెట్లో లిస్టయిన ధర రూ. 252. ఏకంగా 367 శాతం పెరిగి లిస్టయింది. ఆ తర్వాత కూడా ఆగలేదు. 400 శాతానికిపైగా పెరిగి రూ. 264.60 వద్ద గరిష్టాన్ని తాకింది. దీంతో ఈ ఐపీఓ వచ్చిన ఇన్వెస్టర్లు లిస్టింగ్‌తోనే ఒక్కో షేరుపై రూ. 198 లాభం పొందగా.. గరిష్ట విలువ వద్ద చూస్తే రూ. 210 చొప్పున లాభం వచ్చింది. ప్రస్తుతం ఈ షేరు ధర రూ. 239.40 వద్ద ఉంది. కే సీ ఎనర్జీ అండ్ ఇన్‌ఫ్రా లిమిటెడ్ ఐపీఓ డిసెంబర్ 28 (గురువారం) రోజు ఐపీఓ సబ్‌స్క్రిప్షన్ కోసం వచ్చింది. ఇది %చీూజు ూవీజు% ఎక్స్చేంజీలో లిస్టయింది. జనవరి 2 (మంగళవారం) రోజున సబ్‌స్క్రిప్షన్ ముగిసింది. ధరల శ్రేణిని రూ. 51-54 వద్ద పేర్కొంది. ఈ ఐపీఓ పరిమాణం మొత్తం 2000 షేర్లు. దీంతో ఇన్వెస్టర్ పెట్టుబడి రూ. 1,08,000 గా ఉంది. లిస్టింగ్ రోజు లాభాల్ని చూస్తే దాదాపు రూ. 4 లక్షలపైనే ఉండటం విశేషం. ఈ ఐపీఓ సబ్‌స్క్రిప్షన్ విషయానికి వస్తే చివరిదైన నాలుగో రోజు ఏకంగా 1052.45 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. రిటైల్ ఇన్వెస్టర్ల నుంచి స్టెల్లార్ రెస్పాన్స్ వచ్చింది. ఈ పోర్షన్ 1311.10 రెట్లు కోటా పూర్తయింది. నాన్ ఇన్‌స్టిట్యూషనల్ బయ్యర్స్ నుంచి 1668 రెట్లు, క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషన్స్ బయ్యర్స్ నుంచి 127 రెట్లు సబ్‌స్క్రిప్షన్ జరిగింది. మొత్తం 19,60,000 షేర్లు అందుబాటులో ఉంచగా.. 2,06,28,08,000 షేర్లకు బిడ్స్ వచ్చాయి.

# ఉద్యోగులకు శుభవార్త.. త్వరలోనే డీఏ పెంపు..



కేంద్ర ప్రభుత్వం ఉద్యోగులకు అదిరే శుభవార్త. 7వ వేతన సంఘం సిఫార్సుల మేరకు డియర్ నెస్ అలవెన్స్ (డీఏ) పెంచేందుకు కేంద్రం కసరత్తు చేస్తోంది. జనవరి 1 నుంచి మొదలయ్యే ఆరు నెలల కాలానికి డీఏ పెంచనుంది. దీనిపై అధికారిక ప్రకటన వచ్చేది అప్పుడేనని పలు వార్తా కథనాలు వెలువడుతున్నాయి. మరి ఈసారి ఎంత పెరగనుందనేది తెలుసుకునే ప్రయత్నం చేద్దాం. కేంద్ర ప్రభుత్వం ఉద్యోగులకు అతి త్వరలో శుభవార్త అందనుంది. ఈ కొత్త ఏడాదికి తొలి ఆరు నెలలు అంటే జనవరి నుంచి ఆరు నెలలకు సంబంధించిన డియర్‌నెస్ అలవెన్స్ (డీఏ), డియర్‌నెస్ రిలీఫ్ (డీఆర్) పెంచేందుకు కసరత్తు మొదలెట్టింది ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర సర్కార్. దీంతో కేంద్ర ప్రభుత్వం ఉద్యోగులకు జీతాలు భారీగా పెరగనున్నాయి. మీడియా నివేదికల ప్రకారం.. వచ్చే ఆరు నెలల కాలానికి గానూ 4 శాతం మేర డీఏ పెంపు ఉంటుందని తెలుస్తోంది. అయితే, డీఏ పెంపునకు సంబంధించిన అధికారిక ప్రకటన 2024, మార్చి నెలలో ఉండనుందని సమాచారం. మార్చిలో డీఏ పెంపు 4 శాతం మేర ప్రకటించినట్లయితే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల డియర్‌నెస్ అలవెన్స్ 50 శాతానికి చేరుకుంటుంది. అంతకు ముందు 2023, అక్టోబర్ నెలలో డీఏ 4 శాతం మే పెంచుతూ కేంద్ర సర్కార్ నిర్ణయం తీసుకుంది. జులై 1, 2023 నుంచి అమలులోకి డీఏ 46 శాతానికి చేరుకుంది. ఇప్పుడు మరో 4 శాతం పెంచినట్లయితే 50 శాతం మార్క్ క్రాస్ కానుంది. దేశంలో ద్రవ్యోల్బణం రేటును బట్టి డీఏ, డీఆర్ పెంపును నిర్ణయిస్తుంది కేంద్రం. ఏడాదిలో రెండు సార్లు పర్సంటేజీ ఆధారంగా ఈ పెంపు అనేది ఉంటుంది. సాధారణంగా ప్రతి ఏటా మార్చి, సెప్టెంబర్ నెలల్లో ఈ ప్రకటనలు ఉంటాయి. కరువు భత్యంపై సమీక్ష అనేది జనవరి 1, జులై 1 నుంచి మొదలవుతుంది. డియర్‌నెస్ అలెన్స్ కి సైతం ఇదే నియమం వర్తిస్తుంది. డీఏ లెక్కించే ఫార్ములను 2006లో సవరించింది కేంద్రం. గత ఏడాది జూన్ తో ముగిసే సమయానికి ఆల్ ఇండియా కన్స్యూమర్ ప్రైస్ ఇండెక్స్ ప్రకారం 12 నెలల సగటు ఆధారంగా డీఏ పెంపును నిర్ణయిస్తారు. ప్రస్తుతం ఏఐసీపీఐ అనేది 139.1 శాతానికి చేరుకుంది. ఇది ధరల పెరుగుదలను సూచిస్తోంది. అంటే ఈసారి డీఏ పెంపు గణనీయం గానే ఉండనుందనే వాదనలు వినిపిస్తున్నాయి. డియర్‌నెస్ అలవెన్స్ అంటే దేశంలో ద్రవ్యోల్బణానికి అనుగుణంగా ఉద్యోగుల కు జీతంతో పాటు అందించే కరువు భత్యం. ద్రవ్యోల్బణం పెరిగిన సందర్భంలో కరెన్సీ విలువ తగ్గి ఉద్యోగుల కొనుగోలు శక్తిని దెబ్బ తీస్తుంది. వారి వాస్తవ ఆదాయంపై ప్రతికూల ప్రభావం చూపిస్తుంది. దానిని భర్తీ చేసేందుకే కేంద్ర ప్రభుత్వం కరువు భత్యం అందిస్తుంది. ఉద్యోగులకు డీఏ పెంచినట్లుగానే పెన్షనర్లకు డీఆర్ పెంపు ఉంటుంది. డీఏ పెంపుతో కేంద్రంలోని సుమారు 48 లక్షల మంది ఉద్యోగులకు లబ్ధి చేకూరనుంది. అలాగే 67 లక్షల మంది పెన్షనర్లు ప్రయోజనం పొందుతారు.

# ఆ పెన్షనర్లకు మరో ఛాన్స్..



కేంద్ర ప్రభుత్వం ఆ రంగానికి చెందిన పెన్షనర్లకు మరో అవకాశం కల్పించింది. నవంబర్‌లో తమ జీవన ప్రమాణ పత్రం (లైఫ్ సర్టిఫికెట్) సమర్పించేందుకు విధించిన గడువు ముగిసిన క్రమంలో మరోసారి పొడిగించింది. ఈనెలాఖరు వరకు లైఫ్ సర్టిఫికెట్ సమర్పించవచ్చని తెలిపింది. ఈ సందర్భంగా గడువు ఎప్పటి వరకు ఉంది, ఎలా సబ్మిట్ చేయాలి అనేది తెలుసుకుందాం.

కేంద్ర ప్రభుత్వం పెన్షనర్లు తమకు ప్రతి నెలా సజావుగా పెన్షన్ కొనసాగాలంటే నిర్దేశిత సమయంలోపు జీవన ప్రమాణ పత్రం సమర్పించాల్సి ఉంటుంది. అందుకు కొంత సమయం ఇస్తుంటారు. తాజాగా రక్షణ రంగానికి సంబంధించిన పెన్షనర్లకు కేంద్రం శుభవార్త అందించి ంది. 2023, నవంబర్ నెలలో లైఫ్ సర్టిఫికెట్ సమర్పిం చాల్సి ఉన్న డిఫెన్స్ పెన్షనర్లకు మరో అవకాశం కల్పిస్తూ ఆ గడువును జనవరి 31, 2024 వరకు పొడిగించింది. అంటే ఈ నెలఖారు వరకు ఇంకా ఎవరైనా ఉంటే సమర్పించవచ్చు. ప్రిన్సిపల్ కంట్రోలర్ ఆఫ్ డిఫెన్స్ అకౌంట్స్ పెన్షన్స్ వెబ్‌సైట్ ప్రకారం.. పెన్షనర్లు నవంబర్ , 2023లో వార్షిక ధ్రువీకరణ పత్రం సమర్పించాల్సి ఉండగా ఆ గడువును జనవరి 2024 వరకు పొడిగిస్తున్నట్లు తెలిపింది. జనవరి 2024 తర్వాత ఎలాంటి ఆటంకం లేకుండా పెన్షన్ కొనసాగాలంటే లైఫ్ సర్టిఫికెట్ సమర్పించాలని కోరింది రక్షణ శాఖ. డిఫెన్స్ రంగానికి చెందిన పెన్షనర్లు తప్పనిసరిగా తమ వార్షిక గుర్తింపు ను ఆధార్ ద్వారా లేదా గుర్తింపు పొందిన అధికార సంస్థలు జారీ చేసిన లైఫ్ సర్టిఫికెట్ ను సమర్పించాల్సి ఉంటుంది. ఇలా చేస్తేనే వారి బ్యాంకు ఖాతాలో పెన్షన్ అనేది ప్రతి నెలా జమవుతుంది. డిఫెన్స్ పెన్షనర్లు తమ లైఫ్ సర్టిఫికెట్ సమర్పించేందుకు ఇప్పుడు జనవరి 31, 2024 వరకు గడువు ఉంటుంది. జీవన్ ప్రమాణ్ పోర్టల్ ద్వారా డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ ఎలా సమర్పించాలి..ముందుగా జీవన్ ప్రమాణ సాఫ్ట్‌వేర్ డౌన్ లోడ్ చేసుకుని ఓపెన్ చేయాలి. ఆ తర్వాత పెన్షనర్ ఆధార్ నంబర్, మొబైల్ నంబర్ ఎంటర్ చేయాలి. ఓటీపీ జనరేట్ బటన్ పై క్లిక్ చేయాలి. మీ రిజిస్టర్డ్ మొబైల్ నంబర్ కు ఓటీపీ వస్తుంది. ఓటీపీ ఎంటర్ చేసి ఓకే బటన్ పై క్లిక్ చేయాలి.న్యూ విండో ఓపెన్ అయిన తర్వాత పెన్షనర్ వివరాలు సమర్పించాలి. రిజిస్టర్డ్ పీపీఓ నంబర్ ఎంపిక చేసుకోవాలి.

# లైంగిక కోరికలు అణుచుకోవాలన్న హైకోర్టు..



ఈ కేసు తీర్పు రాశారని విమర్శించింది. న్యాయం అందించాల్సిన హోదాలో ఉన్న న్యాయమూర్తులు తీర్పులకు సొంత అభిప్రాయాలను జోడించడం సబబు కాదని సూచించింది.

టీనేజీలో ఉన్న బాలికలు లైంగిక కోరికలు అణుచుకోవాలని కోల్‌కతా హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీం కోర్టు తీవ్ర అభ్యంతరం తెలిపింది. తీర్పులోని వ్యాఖ్యలు అభ్యంతరక రంగా ఉన్నాయని వ్యాఖ్యానించింది. ఇలాంటి తీర్పులు రాయడం తీవ్రమైన తప్పిదంగా సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. అయితే గతంలో కోల్‌కతా హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుమోటోగా విచారణ జరిపిన సుప్రీంకోర్టు ఈ మేరకు వ్యాఖ్యలు చేసింది. బాలికను కిడ్నాప్ చేసి.. ఓ యువకుడు లైంగిక దాడి చేసిన ఘటనకు సంబంధించి కోల్‌కతా హైకోర్టు గతంలో ఇచ్చిన సంచలనమైన తీర్పుపై తాజాగా సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ కేసు విచారణలో భాగంగా కోల్‌కతా హైకోర్టు ఇచ్చిన తీర్పుపై తీవ్ర స్థాయిలో అభ్యంతరం వ్యక్తం చేసిన సుప్రీం కోర్టు.. తీర్పును కొట్టివేసింది. ఈ తీర్పు రాసి వెలువరించిన జడ్జిలు.. అతి ముఖ్యమైన న్యాయ సూత్రాలను పరిగణలోకి తీసుకోలేదని తీవ్ర స్థాయిలో విమర్శలు చేసింది. ఉన్నతమైన హోదాల్లో ఉన్న న్యాయమూర్తులు ఇలాంటి సున్నితమైన అంశాలకు సంబంధించిన కేసు తీర్పుల్లో వారి సొంత అభిప్రాయాలను చొప్పించడం సరైంది కాదని తెలిపింది.

టీనేజీ దశలో ఉన్న అమ్మాయిలు తమ లైంగిక వాంఛలను అణచుకోవాలంటూ కొన్ని నెలల క్రితం కోల్‌కతా హైకోర్టు ఇచ్చిన సంచలన తీర్పుపై సుప్రీం కోర్టు తీవ్ర అభ్యంతరం తెలిపింది. అయితే ఈ కేసులో కోల్‌కతా హైకోర్టు ఇచ్చిన తీర్పులోని ప్రతి వ్యాక్యం అభ్యంతరకరంగా ఉన్నాయని పేర్కొంది. ఇలాంటి తీర్పులు రాయడం తీవ్రమైన తప్పిదంగా సుప్రీంకోర్టు అసహనం వ్యక్తం చేసింది. కీలకమైన న్యాయ సూత్రాలను పరిగణనలోకి తీసుకోకుండానే న్యాయమూర్తులు

పశ్చిమ బెంగాల్‌లో 14 ఏళ్ల బాలికను ఓ యువకుడు కిడ్నాప్ చేసి అత్యాచారానికి పాల్పడిన ఘటనపై కేసు నమోదైంది. ఈ కేసులో విచారణ జరిపిన ట్రయల్ కోర్టు నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష విధించింది. ఈ ట్రయల్ కోర్టు తీర్పును నిందితుడు కోల్‌కతా హైకోర్టులో అప్పీల్ చేశాడు. దీనిపై విచారణ జరిపిన కోల్‌కతా హైకోర్టు 2023 అక్టోబర్‌లో సంచలన తీర్పును చదివి వినిపించింది. టీనేజీ దశలో ఉన్న బాలికలు తమ లైంగిక వాంఛలను అదుపులో పెట్టుకోవాలని.. జస్టిస్ చిత్తరంజన్ దాస్, జస్టిస్ పార్థసారథి సేన్‌ల నేతృత్వంలోని హైకోర్టు డివిజన్ బెంచ్ విస్మయపరిచే తీర్పు చెప్పింది. ఆ 2 నిమిషాల సుఖం కోసం బాలికలు పరాజితులుగా మిగిలిపోకూడదని ఉచిత సలహా కూడా ఇచ్చింది. అంతటితో ఆగకుండా ట్రయల్ కోర్టు నిందితుడికి విధించిన 20 ఏళ్ల జైలు శిక్షను రద్దు చేస్తూ తీర్పు వెలువరించింది. అయితే కోల్‌కతా హైకోర్టు ఇచ్చిన తీర్పు తమ దృష్టికి రావడంతో గతేడాది డిసెంబర్ 8 వ తేదీన సుప్రీం కోర్టు సుమోటోగా స్వీకరించింది. హైకోర్టు తీర్పును సవాల్ చేసే ఉద్దేశం పశ్చిమ బెంగాల్ రాష్ట్ర ప్రభుత్వానికి ఉందా.. లేదా..? తెలియజేయాలని ఆ రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. దీంతో కోల్‌కతా హైకోర్టు ఇచ్చిన తీర్పును పశ్చిమ బెంగాల్ సర్కారు సుప్రీం కోర్టులో సవాల్ చేసింది. ఆ పిటిషన్‌పై విచారణను స్వీకరించిన జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ అభయ్ ఎస్ ఓకా నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం కోల్‌కతా హైకోర్టు తీర్పును పూర్తిగా తప్పుపట్టింది. ఆ తీర్పుపై తమ అభ్యంతరాన్ని వెల్లడిస్తూనే తదుపరి విచారణ జనవరి 12 వ తేదీకి వాయిదా వేసింది.

# ఈడీ అధికారులను చుట్టుముట్టి దాడి చేసిన వందల మంది స్థానికులు

పశ్చిమ్ బెంగాల్‌లో కేంద్ర దర్యాప్తు అధికారులకు భయ్యానక అనుభవం ఎదురయ్యింది. ఓ కేసులో అధికార టీఎంసీ నేతను విచారణకు తమ కార్యాలయానికి తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. దీంతో ఆయన అనుచరులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ అధికారులపై దాడికి ప్రయత్నించారు. ఒక్కసారిగా వందల మంది ఎదురొచ్చి.. కార్లను ధ్వంసం చేశారు. దీంతో బతుకుజీవుడా అంటూ అక్కడ నుంచి పారిపోయి ప్రాణాలను కాపాడుకున్నారు. ప్రస్తుతం ఈ ఘటనపై బీజేపీ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులపై స్థానికులు దాడికి పాల్పడిన ఘటన పశ్చిమ్ బెంగాల్‌లో చోటుచేసుకుంది. బెంగాల్‌లో జరిగిన రేషన్ కుంభకోణంపై విచారణ సందర్భంగా ఈడీ అధికారులకు ఈ అనుభవం ఎదురయ్యింది. ఉత్తర 24 పరగణాల జిల్లాకు చెందిన టీఎంసీ నేత షాజహాన్ షేక్‌ను విచారణ తీసుకెళ్తుండగా.. తమ నేతను తీసుకెళ్తున్నారన్న కోపంతో గ్రామస్థులు అడ్డుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. రేషన్ కుంభకోణంపై సర్బేరియా గ్రామం సహా పశ్చిమ్ బెంగాల్ వ్యాప్తంగా 18 చోట్ల ఈడీ అధికారులు సోదాలు నిర్వహించారు.

ఈ క్రమంలో టీఎంసీ నాయకుడు షాజహాన్ షేక్‌ను విచారణ నిమిత్తం ఈడీ అధికారులు సర్బేరియా గ్రామానికి చేరుకుని, అనంతరం ఆయనను ఈడీ కార్యాలయానికి తమ వాహనం తీసుకెళ్లారు. దీంతో తమ నేతను ఎలా తీసుకెళ్తారంటూ 200 మందికిపైగా స్థానికులు ఈడీ అధికారుల కార్లను చుట్టిముట్టారు. వారిలో కొందరు కర్రలు, రాళ్లతో దాడిచేసి కార్లను ధ్వంసం చేశారు. ఆ సమయంలో ఈడీ అధికారులకు భద్రతగా సీఆర్పీఎఫ్ జవాన్లు కూడా ఉన్నారు. అయినాసరే వెనక్కి తగ్గకుండా వాహనాల డోర్లను తెరిచి, అధికారులను లాగడానికి ప్రయత్నించారు. తుపాకులు, ఇతర ఆయుధాలతో దాడికి ప్రయత్నించారు. దర్యాప్తు బృందం వాహనాలు ధ్వంసం చేయగా.. ఒక అధికారి తలకు గాయమైంది.

అధికారులు, జవాన్లు చెల్లాచెదురైన బైక్‌లు, ఆటోల సాయంతో సంఘటనా స్థలం నుంచి పారిపోయి తమ ప్రాణాలను కాపాడుకున్నారు. కాగా, ఈ ఘటనపై ప్రతిపక్ష బీజేపీ తీవ్రంగా మండిపడింది. రాష్ట్రంలో శాంతిభద్రతలు అధ్వానంగా ఉన్నాయనడానికి ఈ ఘటన నిదర్శనమని ప్రతిపక్ష బీజేపీ నేత సువేందు అధికారి విమర్శించారు. శాంతి భద్రతలను పరిరక్షించాలని, ఘటనకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలన్నియన డిమాండ్ చేశారు. జాతీయ దర్యాప్తు బృందంతో విచారణ జరిపించాలని అన్నారు. లబ్ధిదారుల కోసం ఉద్దేశించిన ప్రజా పంపిణీ వ్యవస్థ రేషన్‌లో దాదాపు 30 శాతం బహిరంగ మార్కెట్‌కు



అక్రమంగా మళ్లించారని ఈడీ గతంలో ఆరోపిం చింది. ఈ కుంభకోణానికి సంబంధించి బెంగాల్‌లో నెలల తరబడి ఈడీ దాడులు కొనసాగు తున్నాయి.ాష్ట్రంలో రైతుల పేరుతో నకిలీ ఖాతాలు సృష్టించి పలువురు రైస్ మిల్లర్లు, కోఆపరేటివ్ సొసైటీలు మద్దతు ధరను స్వాహా చేస్తున్నారనేది ఈడీ ప్రధాన ఆరోపణ. ఇదే కేసులో గతేడాది అక్టోబర్ 14న రైస్ మిల్లు యజమాని రహ్మాన్‌ను దర్యాప్తు సంస్థ అరెస్టు చేసింది. తాజాగా, ఈ కుంభకోణంతో ప్రమేయం ఉన్నట్టు అనుమానిస్తున్న టీఎంసీ నేతను విచారించడానికి ఈడీ ఆయన గ్రామానికి వెళ్లగా ఈ ఘటన చోటు చేసుకుంది.

# ఆర్థిక వృద్ధి, విదేశీ వ్యవహారాలు భేష్ అని కితాబు

ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై చైనా మీడియా ప్రశంసల జల్లు కురిపించింది. 10 ఏళ్ల నరేంద్ర మోదీ పాలనలో భారత్ అన్ని విధాలుగా అభివృద్ధి చెందిందని పేర్కొంది. ఆర్థికంగా, సామాజికంగా, విదేశాంగ విధానాల్లో భారత్ గణనీయమైన ప్రగతిని సాధిస్తోందని చైనీస్ స్టేట్ మీడియా కొనియాడింది. భారత్ అన్నా, భారత ప్రధాని అన్నా ఎప్పుడూ అక్కసు వెళ్లగక్కే చైనా తాజాగా ప్రధాని నరేంద్ర మోదీని ప్రశంసలతో ముంచెత్తింది. నరేంద్ర మోదీ ప్రధాని అయిన తర్వాత ఆయన హయాంలో భారత్ గణనీయమైన ప్రగతిని సాధించిందని పేర్కొంది. షాంఘై ప్రావిన్స్‌లోని ఫుడాన్ యూనివర్శిటీలో ఉన్న సౌత్ ఏషియన్ స్టడీస్ సెంటర్ డైరెక్టర్ జాంగ్ జియాడాంగ్ రాసిన ఓ స్టోరీని చైనీస్ ప్రభుత్వ మీడియా సంస్థ గ్లోబల్ టైమ్స్ తాజాగా ప్రచురించింది. ముఖ్యంగా గడిచిన 4 ఏళ్లలో భారత్ సాధించిన అద్భుత విజయాలను అందులో ప్రస్తావించింది. ఆర్థిక, సామాజిక పాలన, విదేశాంగ విధానాల్లో భారత్ గణనీయమైన ప్రగతిని సాధిస్తోందని.. అది ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ ఉన్నందునే సాధ్యమైందని చైనీస్ స్టేట్ మీడియా ఏజెన్సీ గ్లోబల్ టైమ్స్ ప్రశంసించింది. అభివృద్ధి చెందడంలో భారత్ వ్యూహాత్మకంగా, నమ్మకంగా, క్రియాశీలకంగా వ్యవహరిస్తోందని అందులో వ్యాఖ్యానించింది. భారత బలమైన ఆర్థిక వృద్ధి, అర్బన్ గవర్నెన్స్ మరింత ఉన్నతంగా తీర్చిదిద్దినట్లు కొనియాడింది. అంతర్జాతీయ సంబంధాలు మరీ ముఖ్యంగా చైనాతో భారత్ తన వైఖరి మార్పును ప్రస్తావించింది. వాణిజ్యం పరంగా చైనా, భారత్ మధ్య ఉన్న అసమానతలను తగ్గించేందుకు భారత్ ఎన్నో చర్యలు తీసుకోవడంపై దృష్టి సారించిందని పేర్కొంది. ఇక ప్రస్తుతం భారత్ తన ఎగుమతుల సామర్థ్యాలను పెంచుకునేందుకు ఎక్కువ దృష్టి పెడుతోందని వెల్లడించింది. అత్యంత వేగవంతమైన ఆర్థిక, సామాజిక అభివృద్ధితో భారత్ వ్యూహాత్మకంగా.. నమ్మకంగా రూపొందించి అభివృద్ధి చేయడంలో భారత్ మరింత క్రియాశీలకంగా మారిందని కథనం పేర్కొంది. మరోవైపు.. రాజకీయ, సాంస్కృతిక



రంగాల్లో.. పాశ్చాత్య దేశాలతో తన ప్రజాస్వామ్య ఏకాభిప్రాయాన్ని నొక్కి చెప్పడానికి ప్రజాస్వామ్య రాజకీయాల్లో భారతీయ లక్షణాన్ని హైలైట్ చేసే స్థాయికి చేరుకుందని ప్రశంసించింది. ఇక ప్రస్తుతం ప్రజాస్వామ్య రాజకీయాల భారతీయ మూలాలపై మరింత ఎక్కువ ప్రాధాన్యత ఉందని చెప్పింది. చారిత్రక వలస రాజ్యాల నీడ నుంచి తప్పించుకోవడాని కి.. రాజకీయంగా, సాంస్కృతికంగా ప్రపంచంలోనే విశ్వ గురుగా వ్యవహరించాలనే ఆశయాన్ని భారత్ ప్రతిబింబిస్తోందని జాంగ్ జియాడాంగ్ కథనం రాశారు.

అంతర్జాతీయంగా తీవ్ర ప్రభావం చూపిన రష్యా-ఉక్రెయిన్ వివాదంలో తటస్థ వైఖరిని అవలంభిస్తూనే అమెరికా, జపాన్, రష్యా వంటి అగ్ర దేశాలతో సంబంధాలను పెంపొందించడానికి ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని భారత విదేశాంగ విధాన వ్యూహంపై ప్రశంసలు గుప్పించింది. విదేశాంగ విధానంలో భారత్ వ్యూహాత్మక ఆలోచన మార్పుకు గురైందని.. గొప్ప శక్తి వ్యూహం వైపు కదులుతుందని చైనా మీడియా కొనియాడింది. ప్రధాని నరేంద్ర మోదీ అధికారం చేపట్టినప్పటి నుంచి అమెరికా, జపాన్, రష్యాలతో సంబంధాలను మరింతగా ప్రోత్సహిస్తున్నారని.. భారత్ ఎల్లప్పుడూ తనను తాను ప్రపంచ శక్తిగా పరిగణిస్తోందని చెప్పింది.

# అందరి గుండెల్లో విష్ణు నిలిచిపోతారు

## పట్టణ ప్రజలకు ఆయన అందించిన సేవలు అజరామరం: శాసనమండలి చైర్మన్ గుత్తా





**మిర్యాలగూడ టౌన్, జనవరి 7, మన సాక్షి:**

మిర్యాలగూడ పురపాలక సంఘ వైస్ చైర్మన్ కుర్ర కోటేశ్వర్ రావు అలియాస్ విష్ణు చిరస్మరణీయుడని తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు పేర్కొన్నారు. గతనెల 26న గుండెపోటుతో విష్ణు మృతి చెందారు. ఆదివారం మిర్యాలగూడ పట్టణంలో నందిపహాడ్ లోని టీఎన్ఆర్ గార్డెన్స్ లో ఆయన సంతాప సభను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గుత్తా సుఖేందర్ రెడ్డి, నల్లమోతు భాస్కర్ రావు పాల్గొన్నారు. విష్ణు చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీకి, మిర్యాలగూడ పట్టణ ప్రజలకు విష్ణు అందించిన సేవలు అజరామరమని కొనియాడారు. అందరి గుండెల్లో ఆయన చిరస్థాయిగా నిలిచిపోతారని అన్నారు. మిర్యాలగూడ పట్టణ బీఆర్ఎస్ కు ఆయన లేని లోటు పూడ్చలేనిదని అభిప్రాయపడ్డారు. తాను నమ్ముకున్న సిద్ధాంతం కోసం నిబద్ధత, క్రమశిక్షణతో పని చేసే విష్ణు లాంటి నేతలు యువతకు ఆదర్శమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమెల్సీ మంకెన కోటిరెడ్డి ,మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్, తెలంగాణ రాష్ట్ర ఆగ్రోస్ మాజీ చైర్మన్ తిప్పన విజయసింహా రెడ్డి ,జూలకంటి రంగారెడ్డి, నల్లగొండ జిల్లా రైతు బంధు సమితి మాజీ అధ్యక్షులు చింతరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, నల్లగొండ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ దుర్గంపూడి నారాయణరెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కుందూరు వీరకోటి రెడ్డి, మాజీ జడ్పీ చైర్మన్ సీడీ రవి కుమార్, యువ నాయకులు గుత్తా అమిత్ రెడ్డి, బీఆర్ఎస్ యువనేత నల్లమోతు సిద్దార్థ, జిల్లా కో-ఆప్షన్ సభ్యులు మోసిన్ అలీ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చిట్టిబాబు నాయక్, మండల పార్టీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు జొన్నలగడ్డ రంగారెడ్డి, అంగోతు హాతీరాం నాయక్, రైతు సంఘం జిల్లా మాజీ అధ్యక్షులు నామిరెడ్డి యాదగిరి రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి పెద్ది శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, పాక్స్ చైర్మన్లు, పట్టణ మున్సిపల్ కౌన్సిలర్లు, ఆయా గ్రామాల సర్పంచ్లు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, విష్ణు అభిమానులు, పాల్గొన్నారు.

## సభ్యత్వ నమోదును జయప్రదం చేయాలి



**మిర్యాలగూడ టౌన్, జనవరి 7, మన సాక్షి:**

మహిళా హక్కుల సాధన కోసం మహిళలో ఐక్యత పెంచేందుకు ఐద్వా ఆధ్వర్యంలో ఈనెల 8న సభ్యత నమోదు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఐద్వా జిల్లా అధ్యక్షులు పోలేబొయిన వరలక్ష్మి కోరారు.ఆదివారం స్థానిక ఐద్వా కార్యాలయంలో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ......మహిళల రక్షణ కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలు తీసుకురావాలని కోరారు.మహిళా అభివృద్ధికి పాలకులు పాటుపడాలన్నారు. మహిళపై జరుగుతున్న దాడులు అత్యాచారాలను అరికట్టాలని,అని రంగాలలో మహిళలకు ప్రాథమిక ఇవ్వాలన్నారు.మహిళల సంక్షేమం కోసం ప్రభుత్వాలు ప్రత్యేకంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. మహిళల్లో ఐక్యత తీసుకొచ్చేందుకు మహిళా సంఘం ఎంతో కృషి చేస్తుందన్నారు.రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 8న ఒకరోజు సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపడుతున్నట్లు మహిళలు అధిక సంఖ్యలో సభ్యత్వం తీసుకొని సంఘాన్ని బలోపేతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం సీనియర్ నాయకురాలు గాదె పద్మ, జిల్లా నాయకులు కంచర్ల ఊర్మిళ ఓగోటి పూలమ్మ, గుంటక మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## విష్ణు సంతాన సభలో పాల్గొన్న బి.ఆర్.ఎస్ నాయకులు



**వేములపల్లి, జనవరి 7, మన సాక్షి:**

మిర్యాలగూడ మున్సిపల్ వైస్ చైర్మన్ కుర్ర విష్ణు ఇటీవల మరణించిన విషయం తెలిసిందే. ఆదివారం మిర్యాలగూడ పట్టణంలోని నందిపాడు టి.ఎన్.ఆర్ గార్డెన్ నందు ఏర్పాటు చేసిన సంతాపం సభకు వేములపల్లి సర్పంచ్ చిర్ర మల్లయ్య యాదవ్,రావులపెంట గ్రామ ఎంపిటిసి నంద్యాల శ్రీరామ్ రెడ్డి పాల్గొన్నారు.అనంతరం విష్ణు చిత్రపటానికి పూలమాల వేసి జోహార్లు అర్పించారు.వారి వెంట బి.ఆర్.ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు చంద్రయ్య, సీనియర్ నాయకులు వెంకటేశ్వర్లు, శీలం జగన్, కత్తుల సైదులు, వార్డు మెంబర్ చీమల వెంకన్న, సైదులు, మట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరామ పూజిత అక్షింతల పంపిణీ



**శాలిగౌరారం,జనవరి 07,మనసాక్షి:**

శాలిగౌరారం మండలం ఉట్కూరు గ్రామంలో అయోధ్య రామ మందిర నిర్మాణ సందర్భంగా పంపిన పూజిత అక్షింతలను దేవాలయం పునర్నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈనెల 22వ తేదీన అయోధ్యలో సీతారామచంద్రస్వామి వారి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవ సందర్భంగా అయోధ్య నుండి వచ్చిన అక్షింతలను గ్రామంలోని ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ దైవనుగ్రహం తో గ్రామంలోని ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని వేడుకున్నారు.గ్రామంలో పాడిపంటలు బాగా పండి అందరు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. గ్రామంలో నూతనంగా నిర్మించానున్న శ్రీ శివాంజనేయ స్వామి దేవాలయా నిర్మాణానికి గ్రామం లోని ప్రజలు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమం లో దేవాలయం నిర్మాణం కమిటీ అధ్యక్షులు రంగు ముత్యంరాజు కార్యదర్శి కె బ్రహ్మ చారి, కమిటీ సభ్యులు శ్రీధర నర్సయ్య, రంగు రాములు, పల్స శ్రీనివాస్, రంగు బిక్షం, ఎంపల్ల పురుషోత్తం రెడ్డి,కప్పల సురేష్, చిత్తలూరి సైదులు, సైదుల శ్రీనివాస్, జెసిబి శ్రీను, శీలం శంకర్ భాల్ రెడ్డి, చైతన్య, టి నర్సింహా చారి, జి రామనర్సయ్య మహిళలు, రంగు స్వాతి, రంగు మంగమ్మ ప్రమీల, సువర్ణ,కప్పల మంగమ్మ,అండాలు, యాదమ్మ,, మహేశ్వరి, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

## లెఫ్ట్....రైట్...హార్సిలీహిల్స్‌లో మిట్స్ విద్యార్థుల ట్రెక్కింగ్...!!




**మదనపల్లి,జనవరి 7,మన సాక్షి**

మదనపల్లి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్,(మిట్స్) కళాశాల యెన్.సి.సి క్యాడెట్స్ స్థానిక హార్సిలీ హిల్స్ నందు ట్రెక్కింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందు లో బాగంగా కళాశాలలోని ఎన్సిసి క్యాడెట్స్ ఉదయం హార్సిలీ హిల్స్ పైకి చేరుకున్నట్లు ఎన్.సి.సి లెఫ్టినెంట్ ఎన్ నవీన్ కుమార్ తెలిపారు. దేశ రక్షణ కొరకై అత్యవసర సమయాలలో ప్రతి ఒక్కరిని కాపాడుటకు వీలుగా క్యాడెట్స్ ట్రైనీ అయి ఉండేందుకు ఇలాంటి కార్యక్రమాలను ఏర్పాటు చేస్తారని ఆయన అన్నారు. కళాశాల ఎన్సిసి క్యాడెట్స్ సుమారు 100 మంది ఎంతో ఆసక్తిగా ఈ కార్యక్రమం పాల్గొన్నారని, అధ్యాపకులు ఉన్నారని 'ఆయన అన్నారు. విద్యార్థులకు రోప్ హ్యాండ్లింగ్, హిల్ క్లిబింగ్ మొదలైన వాటిపై శిక్షణను అందజేశామని ఆయన అన్నారు. ఉదయం 7 గంటలకు ప్రారంభించి 11 గంటలకు చేరుకున్నట్లు ఆయన అన్నారు. హిల్స్ లో క్యాడెట్స్ కు సి సెరిటిఫికేట్, బి సర్టిఫికెట్ల పై అవగాహన కల్పించారు.

## గడప గడపకు అయోధ్య శ్రీరాముని అక్షింతలు



**కోదాడ జనవరి 7, మనసాక్షి :**

కోదాడ పట్టణంలో అయోధ్య శ్రీరాముని అక్షింతలు శ్రీమన్నారాయణ కాలనీ నుండి గడపగడపకు పంపిణీ చేశారు. ముందుగా అక్షింతలకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి ఊరేగింపుగా పలు వీధుల్లో జై శ్రీరామ అంటూ నినాదాలు చేస్తూ శోభాయాత్ర నిర్వహించారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, ఉమా, శ్రీలత సౌజన్య, యామిని, ఉష అధిక సంఖ్యలో మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

## ఆరు గ్యారెంటీ పథకాలు అర్హులైన పేదలకు ఇవ్వాలి

**సూర్యాపేట,జనవరి 07,మనసాక్షిటీ**



ఆరు గ్యారెంటీ పథకాలు అర్హులైన పేదలకు కచ్చితంగా అందించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఏలుగూరి గోవిందు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సీతారాంపురంలో జరిగిన సిపిఎం పార్టీ వన్ టౌన్ కమిటీ సమావేశంలో మాట్లాడుతూ ఆరు గ్యారంటీ పథకాల కోసం రాష్ట్ర ప్రజలు ఆశలతో ఎదురుచూస్తున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఆరు గ్యారంటీ పథకాలతో కాంగ్రెస్ ప్రభుత్వం పట్టణాలలో పది రోజులుగా గ్రామ సభ ఏర్పాటు చేసి దరఖాస్తుల స్వీకరిస్తున్నారని , దరఖాస్తు పెట్టుకున్న ప్రతి దరఖాస్తులను పున పరిశీలించి అర్హులైన పేదలకు ఆ పథకాన్ని అందించాలనికోరారు. రేషన్ కార్డు లేని వారికి తక్షణం రేషన్ కార్డులు అందించి వారి సమస్యలు పరిష్కరించాలని అన్నారు .ఆరు గ్యారంటీ పథకాలు ప్రజలకు అందే వరకు సిపిఎం పార్టీ ప్రజల పక్షాన ఉంటుందని ప్రజా సమస్యలే పరిష్కారం దీటుగా పోరాటం చేస్తామని ఆయన అన్నారు. ఈ సమావేశంలో సిపిఎం పట్టణ నాయకులు వల్లపు దాసు సాయికుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పట్టణ కమిటీ సభ్యులుమామిడి సుందరయ్య,షేక్ సైదులు, అర్వపల్లి లింగయ్య,షేక్ జహంగీర్,మామిడి పుల్లయ్య, శశిరేఖ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## పనికర లింగయ్య స్తూపాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే

**శాలిగౌరారం,జనవరి 07,మనసాక్షి:**



శాలిగౌరారం మండలం గురజాల గ్రామానికి చెందిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధులు పనికిర లింగయ్య ప్రథమ వర్ధంతిని కుటుంబ సభ్యులు, ఎంసిపిఐయూ ఆధ్వర్యంలో ఆదివారం గురజాల గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన స్థూపాన్ని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ,టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు చామల కిరణ్ కుమార్ రెడ్డిలు ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సంస్కరణ సభలో ఎమ్మెల్యే వేముల వీరేశం,టీపీసీసీ ఉపాధ్యక్షులు చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ శాలిగౌరారం మండలం పోరాటాలకు పుట్టిన ఇళ్ళని సాయిధరైతంగా పోరాటంలో యానాల మల్లారెడ్డి తో పాటు పనికిరా లింగయ్య ఎంతోమంది పోరాట యోధులు నాడు రైతాంగ పోరాటంలో క్రియాశీలక పాత్ర పోషించారని కొనియాడారు.ఈ ప్రాంతానికి గొప్ప చరిత్ర ఉంది . పనికిర లింగయ్య ప్రజా సమస్యలపై ఉద్యమాలు చేశారు.ఆయన సేవలు శాలిగౌరారం మండల ప్రజలు మరువలేనివి అని అన్నారు .ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు సమరం రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షులు అన్నెబొయిన సుధాకర్, వేముల గోపినాథ్ , పనికిర కృష్ణ, ఎంసీపీఐ యూ నాయకులు అశోక్,వెంకన్న ,వీరపాపయ్య ,ఎంపీటీసీ నోముల జనార్ధన్, జహంగీర్ ,సీపీఎం నాయకులు మల్లయ్య, మాజీ సర్పంచ్ మారం వేణుగోపాల్ రెడ్డి, గూని వెంకటయ్య, లోడంగి మహేష్,తదితరులు పాల్గొన్నారు.

## వలిగొండ లో అయోధ్య అక్షింతలు ఇంటింటికి పంపిణి



**వలిగొండ: జనవరి 7 ,మన సాక్షి**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ పట్టణంలో ఆదివారం రోజున అయోధ్య రామ జన్మభూమి శ్రీరాముని ఆలయం ఈనెల 22న జరుగు ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని రాములవారి అక్షింతలను పట్టణంలో ఇంటింటికి పంపిణీ కార్యక్రమం చేపట్టిన గ్రామ సర్పంచ్ బోళ్ల లలిత శ్రీనివాస్, ఆర్ఎస్ఎస్ ,విశ్వహిందూ పరిషత్, బిజెపి నాయకులు, కార్యకర్తలు అక్షింతలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు దంతూరి సత్తయ్య, సీనియర్ నాయకులు సీలోజు శ్రీరాములు, ఆర్ఎస్ఎస్ నాయకులు గోద శ్రీనివాస్, పాండు, బచ్చు శ్రీనివాస్, అప్పిశెట్టి సంతోష్ కుమార్, చీకటిమళ్ళ వెంకటేశ్వర్లు, గౌరీశెట్టి అశోక్ ,హరిబాబు, జగన్ ,నువ్వుల శ్రీనివాస్, పంజాల పద్మ, బిజెపి నాయకులు ,కార్యకర్తలు, భక్తులు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజాపాలనతో ప్రజలు అలర్ట్: సైబర్ నెరగాళ్లతో జాగ్రత్తగా ఉండాలి

**అనంతగిరి,జనవరి 07,మన సాక్షి:**



ప్రజా పాలనతో ప్రజలు అలర్ట్ గా ఉండాలని, ప్రజా పాలన దరఖాస్తులు ఇచ్చారా అంటూ సైబర్ నెరగాళ్లు మీకు పథకాలు మంజూరు చేస్తామని చెప్పి మొబైల్ ఓటిపిలు అడిగే అవకాశం ఉందని సూర్యాపేట జిల్లా అనంతగిరి మండల ఎస్సై అనిల్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ... మొబైల్ ఓటిపిలు అడిగితే చెప్పకుండా హెల్ప్ లైన్ నెంబర్ 1930 ఫోన్ చేయాలని తెలిపారు. ఫోన్ కలవకపోతే సైబర్ క్రైమ్.గౌట్.ఇన్ మెయిల్ ఐడి కి పంపాలని తెలిపారు. సైబర్ నెరగాళ్లతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

## మార్తన్ రన్ పూర్తిచేసిన వలిగొండ మండల వాసులు

**వలిగొండ: జనవరి 7 ,మన సాక్షి:**



రాచకొండ ఇన్స్టిట్యూట్ టీం మేడిపల్లి హైదరాబాద్ కోచ్ ప్రభాకర్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం ఆరు గంటలకి మార్తాన్ రన్ 2%వా%24 నిర్వహించారు, ఈ రన్ 42.1 కిలోమీటర్లు ఘట్కేసర్, ఓ ఆర్ ఆర్ సర్వీస్ రోడ్ నుండీ హాయత్ నగర్ వరకు నిర్వహించారు.ఈ మార్తాన్ రన్ లో హైదరాబాద్ ఇంటెలిజెన్స్ ఆఫీసులో పనిచేస్తున్న ఇన్స్పెక్టర్ వలిగొండ మండలం ప్రొద్దుటూరు కు చెందిన దుబ్బ కిషన్ పాల్గొని 42.2 కిలోమీటర్ల పరుగును 4 గం: 22 నిమిషాలలో పూర్తి చేశారు . వలిగొండ మండలంలోని మల్లేపల్లి గ్రామానికి చెందిన శ్రీశైలం 42.2కి. మీ, నాగారం గ్రామానికి చెందిన కట్టా శేఖర్ 21.2కి. మీ ఆఫ్ మార్తాన్ పరుగును పూర్తి చేయడం జరిగింది., వీరికి అధికారులు స్నేహితులు శ్రేయోభిలాషులు, అభినందనలు తెలియజేశారు.

# గిరిజన గ్రామాల రహదారులకు మహర్దశ: ఎమ్మెల్యే రెడ్డి శాంతి

**మెలియాపుట్టి,జనవరి 7,మన సాక్షి:**



ఆంధ్ర ప్రదేశ్ లో అభివృద్ధి , సంక్షేమం సీఎం జగనన్నకు రెండు కళ్ళుగా భావించి పాలన సాగిస్తున్నారని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. శ్రీకాకుళం జిల్లా పాతపట్నం నియోజకవర్గంలో గిరిజన గ్రామాల కు మంజూరైన రహదారులు తోపాటు ప్రతిపాదనలను పంపించిన రహదారుల గురించి ఎమ్మెల్యే రెడ్డి శాంతి క్యాంప్ కార్యాలయం నుండి ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.గిరిజన గ్రామాల అభివృద్ధి, మౌళిక సదుపాయాల కల్పనలో భాగంగా పాతపట్నం నియోజకవర్గంలోని గిరిజన గ్రామాలకు

రహదారి సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని శాసన సభ్యురాలు రెడ్డి శాంతి సీఎంకు విజ్ఞప్తి చేశారు. మంజూరైన రహదారులు వివరాలు ఇలా ఉన్నాయి. మెలియాపుట్టి మండలం లోని ఆల్ ఆంధ్రా రోడ్డు నుండి కొత్తపేట మీదుగా కూర్మన్నపేట గ్రామం వరకు 1 కి.మీ బీటీ రహదారి నిర్మాణానికి 95 లక్షల రూపాయలు మంజూరైనట్లు ఎమ్మెల్యే తెలిపారు. పాతపట్నం మండలం లోని పాతపట్నం- టెక్కలి రోడ్డు నుండి ద్వారకాపురం గ్రామం వరకు 690 మీటర్ల బీటీ రహదారి నిర్మాణానికి 75 లక్షల రూపాయలు మంజూరయ్యా వన్నారు .అలాగే మెలియాపుట్టి మండలం లోని నేలబొంతు రోడ్డు నుండి అనంతగిరి,రింపి గ్రామాల మీదుగా ఆంపురం గ్రామం వరకు 3.60 కి.మీ బీటీ రహదారి నిర్మాణానికి 3 కోట్ల రూపాయలు మంజూరు చేశారని ఎమ్మెల్యే తెలిపారు. మెలియాపుట్టి మండలంలోని టెక్కలిపట్నం-గొప్పిలి.నుండి సంత లక్ష్మీపురం గ్రామం మీదుగా గంగన్నపేట గ్రామం వరకు 2.5 కి.మీ బీటీ రహదారి నిర్మాణానికి 2 కోట్ల రూపాయలు మంజూరు అయినట్లు వివరించారు. అలాగే ఎమ్మెల్యే రెడ్డి శాంతి పాతపట్నం నియోజకవర్గంలో మరి కొన్ని రహదారుల అభివృద్ధి కొరకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు.మంజూరుకు సిద్ధంగా వున్న రహదారులు...కొత్తూరు మండలం లోని గొట్టిపల్లి రోడ్డు నుండి పెద్దరాజపురం గ్రామం వరకు 2 కోట్ల 90 లక్షలు రూపాయలతో 3 కి మీ బీటీ రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించామని పేర్కొన్నారు. కొత్తూరు మండలంలో గొట్టిపల్లి - పెద్దరాజపురం రోడ్డు నుండి చిన్నరాజపురం గ్రామం వరకు 1 కోటి 40 లక్షల రూపాయలతో సుమారు 1.20 కి.మీ బీటీ రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించామన్నారు.

కొత్తూరు మండలం లోని దిగువ మల్లెలగూడ నుండి ఎగువ మల్లెలగూడ గ్రామం వరకు 85 లక్షలు రూపాయలతో 900 మీటర్ల బీటీ రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు చేయడం జరిగిందన్నారు.హిరమండలం మండలంలో తెంబూరు - హిరమండలం రోడ్డు నుండి సత్య జగన్నాథపురం వరకు ఒక కోటి రూపాయలతో 1 కి.మీ బీటీ రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించడం జరిగింది అని ఎమ్మెల్యే రెడ్డి శాంతి తెలిపారు. రహదారులు మంజూరు చేసి పాత పట్టణం నియోజకవర్గ అభివృద్ధికి సహకరిస్తున్న సీఎం జగనన్ కు ఎమ్మెల్యే రెడ్డి శాంతి కృతజ్ఞతలు తెలిపారు.

## మంత్రి ఉత్తమ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరికలు



**మఠంపల్లి,జనవరి 07,మన సాక్షి:**

సూర్య పేట జిల్లా మఠంపల్లి మండలంలోని కృష్ణ తండా, భీమ్లా తండా సర్పంచ్లు బానోతు రామారావు నాయక్, భూక్యా విజయ రవి నాయక్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం చేస్తున్న 6 గ్యారెంటీ పథకాలు నచ్చి రాష్ట్ర ఇరిగేషన్ పౌరసరఫరాల శాఖ మంత్రివర్యులు నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి సమక్షంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భూక్యా మంజీ నాయక్, మాజీ సర్పంచ్ భీముడు నాయక్, పిఎసిఎస్ వైస్ చైర్మన్ బానోతు బాబు నాయక్, సర్పంచ్ ధరవతు గోవిందు నాయక్, అలాగే సర్పంచ్ లతో పాటు రెండు గ్రామ పంచాయతీ సంబంధించిన ఉప్ప సర్పంచ్లు, వార్డు సభ్యులు, బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు ముఖ్య కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు.

## బీసీ జిల్లా ఉపాధ్యక్షుడుగా ఎర్రబెల్లి దుర్గయ్య నియామకం



**మిర్యాలగూడ టౌన్, జనవరి 7, మన సాక్షి:**

బీసీ సంక్షేమ సంఘం నల్గొండ జిల్లా ఉపాధ్యక్షులుగా పట్టణానికి చెందిన ఎర్రబెల్లి దుర్గయ్యను నియమిస్తున్నట్లు నియామక పత్రాన్ని ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ గారు తెలిపారు. ఆదివారం ఆయన నియామక పత్రాన్ని ఆయనకిచ్చిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బీసీల జనగనన చేయాలని బీసీల జనగణన చేసిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహించాలని ఈ సందర్భంగా ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. నూతనంగా నియామకమైన ఎర్రబెల్లి దుర్గయ్య మాట్లాడుతూ నా మీద నమ్మకం ఉంచి నాకు ఈ పదవి ఇచ్చినటువంటి జాజుల లింగం గౌడ్ గారికి కృతజ్ఞతలీజ్ తెలియజేశారు.బీసీల సమస్యల కోసం నిరంతరం పోరాడుతానని దుర్గయ్య అన్నారు.ఈ కార్యక్రమంలో బంటు వెంకటేశ్వర్లు,కుమ్మరి కుంట్ల సుధాకర్, మహేష్, రాంబాబు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ నిర్మాణం చాలా గొప్పది

### -సిపిఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు



**వలిగొండ, జనవరి 7, మన సాక్షి**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలో 2024 సిపిఐ పార్టీ సభ్యత్వం పునరుద్ధరణ సందర్భంగా ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగినది ఈ సమావేశంలో గోద శ్రీరాములు సిపిఐ జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ పార్టీ నిర్మాణం చేయడంలో సభ్యులు క్రియాశీల పాత్ర వహించాలని ప్రజాసంఘాల ప్రతిష్ట కోసం వాటి సమస్యల పరిష్కారం కోసం ప్రజల మధ్య నుండి ప్రజా పోరాటాలు నిర్వహించాలని పార్టీ నిర్మాణం లో కొనసాగటం పార్టీ నిర్మాణమే చాలా గొప్పదని దానిని అనుసరించి పని చేస్తే మంచి ఫలితాలు వస్తాయని అన్నారు. ఈ సమావేశానికి మండల కార్యదర్శి పోలేపాక యాదయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పార్టీ సభ్యత్వం మండలానికి సంబంధించినది అందజేశారు పార్టీ నిర్ణయించిన సభ్యత్వం మరో 20 శాతం పెంచాలని అన్నారు.ఈ సమావేశంలో నాయకులు బోడిగే సుదర్శన్, సల్వాది రవీందర్,చొప్పరి వెంకటేష్,ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎల్లంకి మహేష్,ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు సూరారం జాను, తదితరులు పాల్గొన్నారు.

## పండ్ల వ్యాపారస్తుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

### - పండ్ల వ్యాపారస్తులు ఐక్యంగా ఉండాలి



**కోదాడ జనవరి 7, మనసాక్షి:**

కోదాడ పండ్ల వ్యాపారస్తుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సంఘ సభ్యులు అందరూ కలిసి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా మాజీ కౌన్సిలర్ షేక్. షమీఉల్లా, గౌరవ అధ్యక్షులుగా కాంగ్రెస్ నాయకులు షేక్. బషీర్,గౌరవ సలహాదారులుగా సిహెచ్ కొండల్ రెడ్డి అడ్వకేట్,షేక్. ఖాజా భాయ్ లు నియామకమయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ సంఘ సభ్యులందరూ ఐక్యంగా ఉండాలని ఎటువంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే తప్పక పరిష్కరిస్తామన్నారు. త్వరలోనే పూర్తిస్థాయి కమిటీని ఎన్నుకోనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో సభ్యులు జిలాని, ఇస్మాయిల్, సలీమా, ఇమామ్ సాహెబ్,నాగుల్,కుద్రతుల్లా,ఎల్లయ్య,సైదు, నరసింహారావు,శ్రీను, నాగుల్ తదితరులు పాల్గొన్నారు.

## వికలాంగుడికి కృత్రిమ అవయవాలు అందిస్తానని హామీ: మదన్ మోహన్ రావు

**ఎల్లారెడ్డి ,జనవరి 07, మన సాక్షి:**



ఎల్లారెడ్డి శాసనసభ్యులు మదన్మోహన్ రావు మరోసారి తన మానవత్వాన్ని చాటుకున్నారు. ఇటీవల ఓ యూట్యూబ్ ఛానల్లో ప్రసారమైన కథనానికి ఆయన స్పందించారు. ఈ కథనానికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎల్లారెడ్డి పట్టణంలోని 9వ వార్డుకు చెందిన వికలాంగుడు రాజు రెండు కాళ్లు కోల్పోయి గత కొన్ని సంవత్సరాలుగా కృత్రిమ అవయవాల కోసం ఎదురు చూస్తున్నాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న స్థానిక శాసనసభ్యులు మదన్మోహన్ రావు స్పందించి రాజుకు కావలసిన కృత్రిమ అవయవాలు తెప్పించి అందిస్తానని తెలిపారు. ఇందుకు సంబంధించిన పనులను చూడాలని ముదెల్లి మోహన్ యాదవ్ అనే వ్యక్తికి ఆయన ఆదేశాలు జారీ చేశారు. భవిష్యత్తులో కూడా రాజుకు ఎల్లవేళలా అండగా ఉంటారని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. తన ఇబ్బందులను వార్తా కథనం రూపంలో ప్రచురించిన పాత్రికేయుడికి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే కు దివ్యాంగుడు రాజు కృతజ్ఞతలు తెలిపారు.

## ఎమ్మెల్యే చొరవతో కదలిన విద్యుత్ యంత్రాంగం

### అంచనాలను రూపొందించిన ట్రాన్స్ కో అధికారులు



**ఎల్లారెడ్డి ,జనవరి 07 : మన సాక్షి:**

ఎల్లారెడ్డి మండలంలోని సోమర్యాగడి తాండ పంచాయతీలో నెలకొన్న విద్యుత్ సమస్యల పరిష్కారానికి అంచనాలను రూపొందించినట్లు ఆ శాఖ డీఈ సి గణేష్ తెలిపారు. ఎమ్మెల్యే మదన్మోహన్ రావు ఆదేశాల మేరకు ఆ తాండ ప్రజాప్రతినిధులతో కలిసి శనివారం విద్యుత్ శాఖ అధికారులు సమస్యల పరిష్కారానికి చర్చించిన విషయం తెలిసిందే. ఇళ్ల మధ్య దూరం ఉన్నందున తండాలో సుమారు 50 నుంచి 60 విద్యుత్ స్తంభాల అవసరం ఉంటాయని ఆయన అన్నారు. తాజాగా ఆదివారం విద్యుత్ శాఖ అధికారులు తండాలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి సుమారు 8 నుండి 10 లక్షల రూపాయల వ్యయం అవుతుందని అంచనాలు రూపొందించినట్లు ఆయన తెలిపారు. సంబంధిత తాండ సర్పంచ్ లచ్యా గణేష్ నాయక్, ఎంపీటీసీ లక్ష్మి శ్రీను, పంచాయతీ పాలకవర్గ సభ్యులు కన్సల్ట్ లెటర్ సంబంధిత ఏఈకి అందజేయాలని ఆయన సూచించారు. అనంతరం పనులు మంజూరయ్యాక అంచనా విలువను చెల్లిస్తే వెంటనే పనులు ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. కాగా తాండ ప్రజాప్రతినిధులు విద్యుత్ సమస్యల పరిష్కారానికి పూర్తిస్థాయిలో సహకరిస్తామని తెలుపడంతో పనులు చేపడతామని తాము హామీ ఇచ్చినట్లు ట్రాన్స్ కో డీఈ తెలిపారు.

## పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

### పాత జ్ఞాపకాలు.... మధుర స్మృతులు.... గురువులకు సన్మానం



**మిర్యాలగూడ టౌన్, జనవరి 7, మన సాక్షి:**

మిర్యాలగూడ...పాతజ్ఞాపకాలు నెమరవేసుకుంటూ...... గడచిపోయిన గత మధుర స్మృతులను గుర్తుచేసుకుంటూ......చదువు నేర్పిన గురువులకు దక్షిణిగా సన్మానిస్తూ..... తమతో చదివిన మిత్రులతో పాత అనుభవాలు, ప్రస్తుత స్థితి గతులను పంచుకుంటూ....1994-1997బ్యాచ్ పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఆదివారం మిర్యాలగూడ పట్టణంలోని కేఎన్ఎం డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేశారు. 1994 97 సంవత్సరములో బి ఏ (ఇ హెచ్ పి)చదివిన విద్యార్థిని విద్యార్థులు 27 సంవత్సరాల తర్వాత పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఏర్పాటు చేసి కలుసుకున్నారు.చదువుకున్న కాలేజీ స్థితిగతులు, చదువులు చెప్పిన గురువుల యొక్క అనుభవాలను గుర్తు చేసుకున్నారు. విద్యార్థులు మిత్రులతో గడిపిన క్షణాలు, గత జ్ఞాపకాలను నాటి ఆనంద క్షణాలను మరోసారి గుర్తు చేసుకుంటూ ఉల్లాసంగా గడిపారు. కళాశాల అభివృద్ధి కోసం చేపట్టే కార్యక్రమాలను గుర్తించి వాటికి తమ వంతు సహాయ సహకారాలు అందజేసే విధంగా నిర్ణయం తీసుకున్నారు. కళాశాల అధ్యాపక బృందం ను ఘనంగా సత్కరించారు. తమతో పాటు చదువుకొని సంగారెడ్డి డిప్యూటీ కలెక్టర్ గా విధులు నిర్వహిస్తున్న డి.దేవుజా ను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఇంచార్జి ప్రిన్సిపాల్ రామ్ రెడ్డి,మాజీ ప్రిన్సిపాల్ యాదగిరి రెడ్డి, కోటేశ్వరరావు, ప్రభాకర్ రావు, రాజేశ్వరి, శ్రీనివాస్ చారి,, చంద్రయ్య పూర్వ విద్యార్థుల కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు మాలోతు దశరథ నాయక్, శ్రీనివాస్, హరి, రాంప్రసాద్,అరవింద్, పరిమళ, వెంకటమ్మ,ధనలక్ష్మి, సునంద తదితరులు పాల్గొన్నారు.

## సాహిత్య పద్మ పురస్కారాలు పొందిన వలిగొండ కవులు



**వలిగొండ: జనవరి 7, మన సాక్షి**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ పట్టణానికి చెందిన తెలుగు పండితుడు గంజి దుర్గాప్రసాద్ కవి, గాయకులు పారుపల్లి నరసింహ లు వీరిరువురికి సాహిత్య పద్మ పురస్కారం హైదరాబాదులోని రవీంద్ర భారతిలో అఖిలభారత పద్మశాలి సంక్షేమ సంఘం నవభారత నిర్మాణ సంఘం వారు సంయుక్తంగా సాహిత్య పద్మ పురస్కారాలు అందించారు .ఈ పురస్కారాలను మాజీ రాజ్యసభ సభ్యుడు విహెచ్ హనుమంతరావు చేతుల మీదుగా పురస్కారాలు పొందారు. సాహిత్య పద్మ పురస్కారాలు పొందిన ఇరువురికి పద్మశాలి సంఘం వలిగొండ గ్రామ ప్రజలు శు భాకాంక్షలు తెలియజేశారు.

## మల్లికార్జున స్వామి కళ్యాణ మహోత్సవం: ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి



**హత్నూర, జనవరి 07,మన సాక్షి:**

మండల కేంద్రమైన హత్నూర గ్రామ శివారులోని మల్లన్న గుట్టలో వెలసిన భ్రమరాంబ మల్లికార్జున స్వామి కళ్యాణ మహోత్సవంలో స్థానిక ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డిలు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద ఆదివారం మల్లికార్జున భ్రమరాంబ మల్లికార్జున స్వామి కళ్యాణ మహోత్సవంతో పాటు అగ్నిగుండాలు బోనాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు హాజరై పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కురుమ సంఘం నాయకులు గ్రామస్తులు ఆలయం వద్ద భక్తుల సౌకర్యార్థం షెడ్డు నిర్మాణంతోపాటు రహదారిని నిర్మించాలని కోరడంతో సానుకూలంగా స్పందించి అభివృద్ధి పనులకు కృషి చేయునట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు కిష్టయ్య ,ఆశయ నరేందర్, మధుసూదన్ గౌడ్, చెన్నారెడ్డి, నర్సింలు, కృష్ణ, రాజు మల్లేశం, శ్రీశైలం, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## శబరి పీఠం సన్నిధానంలో ఎమ్మెల్యే కు సన్మానం

**నారాయణపేట టౌన్, జనవరి 07 మనసాక్షి :-**



జిల్లా కేంద్రం లోని వల్లం పల్లి రోడ్ గల శభరి పీఠం సన్నిధానం నుండి 250మంది స్వాములు ఇరుముడి కార్యక్రమం లో భాగంగా ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణిక రెడ్డి శభరి పీఠం సన్నిధానంలో స్వామి వారికి పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే ను గురుస్వాములు పూల మాల శాలువాతో సత్కారించి తీర్థప్రసాదలు అందించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతు ప్రతిఒక్కరు దైవ చింతన అలవార్చు కోవాలని అయ్యప్ప దీక్ష మొక్షానికి మార్గం అని అన్నారు ఇకార్యక్రమంలో గురుస్వాములు కాకర్లభీమయ్య, జంగిడి వెంకటేష్, సంపత్, మల్లేష్ బట్టి తిప్పన్న, బాలాజీ, కన్నయ్య ,శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మహనీయుల విగ్రహాలకు ప్రభుత్వం రక్షణ కల్పించాలి

## మాడ్గుల మండల గౌడ సంక్షేమ సంఘం అధ్యక్షులు గౌని నరసింహా గౌడ్.







**రంగారెడ్డి జిల్లా, మాడ్గుల ప్రతినిధి, జనవరి 07: మనసాక్షి:**

దళిత బహుజనుల సామ్రాజ్య స్థాపన కోసం పోరాటం చేసి గోల్కొండ కోటను ఏలిన రాజు దళిత బహుజన భారత విప్లవ వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహంతో పాటు దేశ స్వతంత్ర పోరాటం, రాష్ట్ర ప్రత్యేక ఉద్యమాలలో పాల్గొన్న మహనీయుల విగ్రహాలకు రాష్ట్ర ప్రభుత్వం రక్షణ కల్పించాలని మాడ్గుల మండల గౌడ సంక్షేమ సంఘం అధ్యక్షులు గౌని నరసింహ గౌడ్ డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండలం ఆవురుపల్లి గ్రామంలో శనివారం రాత్రి భారత దళిత బహుజన విప్లవ వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని కొంతమంది దుండగులు తాగిన మైకంలో బీరు సీసాలు,రాళ్లతో బాది ధ్వంసం చేసిన దుండగులను శిక్షించాలని నరసింహ గౌడ్ డిమాండ్ చేశారు. పాపన్న గౌడ్ విగ్రహం ధ్వంసం చేసినందుకు నిరసనగా ఆదివారం మండలంలోని సుద్ధపల్లి ఇర్విన్, ఆవురుపల్లి, నల్ల వారి పల్లి గ్రామాలలో బహుజనులు, గౌడ నాయకుల ఆధ్వర్యంలో రాస్తారోకోలు, ధర్నాలు చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. మాడ్గుల మండలం అవుర్ పల్లి గ్రామంలో జరిగిన నిరసన కార్యక్రమంలో నరసింహ గౌడ్ మాట్లాడుతూ గ్రామాలలో రాత్రి వేళలో తాగిన మైకంలో కొంతమంది యువకులు మహనీయుల విగ్రహాలను ధ్వంసం చేస్తున్నారని, ఇలా కొనసాగుతూ పోతే గ్రామాల్లో మహనీయుల విగ్రహాలు భవిష్యత్ తరాలకు కనిపించకుండా పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

రాష్ట్ర ప్రభుత్వం,పోలీస్ శాఖ వారు మహనీయుల విగ్రహాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా దుండగులను కఠినంగా శిక్షించాలని, దుండగులను కాపాడేందుకు ప్రయత్నించిన వారు ఎంతటి వారైనా వారికి సమాజంలో తిరగకుండా చేస్తామని నరసింహ గౌడ్ హెచ్చరించారు. అదేవిధంగా గ్రామాలలో పోలీసుల నిఘా వ్యవస్థ కరువైన నేపథ్యంలో యువకులు తాగుడుకు బానిసై ఎక్కడపడితే అక్కడ తాగి మద్యం సీసాలను పగలగొట్టడం జరుగుతున్నందున మహిళలు చిన్నారులు భయాందోళనకు గురవుతున్నారని ఆయన పేర్కొన్నారు. అనంతరం తాలూకా గౌడ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆధ్వర్యంలో మాడుగుల సిఐ రాజశేఖర్ ని కలిసి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలోతాలూకా మండల, గౌడ సంఘం నాయకులు నిరంజన్ గౌడ్, రవి గౌడ్ వెంకటయ్య గౌడ్,నిరంజన్ గౌడ్,, బాలకృష్ణ గౌడ్, నారాయణ గౌడ్, లాలయ్య గౌడు దళపతి గౌడ్ వెంకటయ్య గౌడ్, శ్రీనివాస్ గౌడ్, సురేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

**దోషులపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటాం: ఇబ్రహీంపట్నం ఏసిపి శ్రీనివాసరావు**

మాడుగుల మండలం అవుర్ పల్లి గ్రామంలో శనివారం రాత్రి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దోషులపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని ఇబ్రహీంపట్నం ఏసీపీ శ్రీనివాస్ రావు తెలిపారు. మండలంలోని అవుర్ పల్లి గ్రామాన్ని ఆదివారం సందర్శించిన ఏసిపి శ్రీనివాసరావు ధ్వంసమైన సర్దార్ పాపన్న గౌడ్ విగ్రహాన్ని పరిశీలించి,ఘటనకు సంబంధించిన వివరాలను సిఐ రాజశేఖర్, గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్తులో ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గట్టి నిఘా ఏర్పాటు చేస్తామని ఏసిపి పేర్కొన్నారు.

# ఎల్లమ్మ అమ్మ వారి కళ్యాణ మహోత్సవం



**శంకర్‌పల్లి: జనవరి 07: మన సాక్షి**

శంకర్‌పల్లి మండలం లోని శేరిగుడ గ్రామంలో శ్రీ ఎల్లమ్మ అమ్మ వారి కళ్యాణ మహోత్సవం కార్యక్రమంలో ఆదివారం చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి భీమ్ భరత్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భీమ్ భరత్ మాట్లాడుతూ నేటి ఆధునిక యుగంలో అనేక ఒడిదుడుకులను ఎదుర్కొంటున్న మనిషి జీవితానికి ఊరట నిచ్చేది భగవంతుని కృప మాత్రమే అని అన్నారు. అమ్మ వారి కళ్యాణంలో పాల్గొనడం తన పూర్వజన్మ సుకృతం అని భీమ్ భరత్ తెలిపారు. ఇంతటి ప్రతిష్ట కలిగిన ఈ ఆలయ అభివృద్ధికి తాను శాయశక్తులా అంకిత భావం తో కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తన పై ప్రత్యేక ప్రేమ చూపించిన ఆలయ నిర్వాహకులకు, గ్రామ ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. గ్రామస్తులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు జనార్దన్ రెడ్డి, బలవంత్ రెడ్డి, కొండకల్ సర్పంచ్ లావణ్య కాశీనాథ్ గౌడ్, షేర్ గూడెం శ్రీనివాస్, వీరారెడ్డి, ప్రశాంత్ కుమార్, శ్రీకాంత్ ముదిరాజ్, కృష్ణారెడ్డి, అనంత్ రెడ్డి, పెంటయ్య, శ్రీశైలం, రామచంద్ర, ఖయ్యూం, అస్లాం పాల్గొన్నారు.

# సర్దార్ పాపన్న గౌడ్ విగ్రహం ధ్వంసం చేసిన దుండగుల్ని వెంటనే అరెస్టు చేయాలి

**రంగారెడ్డి జిల్లా,ఆమనగల్లు ప్రతినిధి,జనవరి 07 మనసాక్షి:**



మాడుగుల మండలం ఆవురుపల్లి గ్రామంలో నిన్న అర్ధరాత్రి సమయంలో దళిత బహుజన వీరుడు గోల్కొండ చక్రవర్తి సర్దార్ పాపన్న గౌడ్ విగ్రహాన్ని ధ్వంసం చేయడం జరిగింది. ఇది పిరికిపందల చర్య అని దుండగుల్ని తక్షణమే అరెస్టు చేసి వెంటనే తగిన శిక్ష విధించాలని తాలూకా గౌడ్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చుక్క అల్లాజి గౌడ్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర స్థాయిలో ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించడం జరిగింది. దళిత బహుజనుల ఆత్మగౌరవం దెబ్బకొట్టేలా వ్యవహరిస్తే సహించబో మని కల్వకుర్తి తాలూకా గౌడ్ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు గంగా రవీందర్ గౌడ్ ఆమనగల్లు మండల గౌడ్ సంఘం అధ్యక్షులు నిరంజన్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు మున్సిపాలిటీ అధ్యక్షులు గజ్జ వెంకటయ్య గౌడ్,కార్యదర్శి సతీష్ గౌడ్, ఆర్థిక కార్యదర్శి గజ్జ నరసింహ గౌడ్, పల్లె నారాయణ గౌడ్, గజ్జి లక్ష్మీపతి గౌడ్, తాలుక నాయకులు గజ్జి బాలకృష్ణ గౌడ్,ఎరుకలి నిరంజన్ గౌడ్, పాల్గొన్నారు.

# జీవో కాపీలను దగ్ధం చేసిన అంగన్వాడీలు



**మెలియాపుట్టి. జనవరి 7. మన సాక్షి:**

జగన్ ప్రభుత్వం అంగన్వాడీల సమ్మె పై ఎస్మా ప్రయోగిస్తూ తెచ్చిన జి.ఒ.నెం.2 వెంటనే ఉపసంహరించుకుని వారి న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని సి.ఐ.టి.యు.జిల్లా అధ్యక్షులు సి.హెచ్. అమ్మన్నాయుడు డిమాండ్ చేసారు. శ్రీకాకుళం జిల్లా పాతపట్నం నియోజకవర్గం కొత్తూరు మండల కేంద్రంలో ఆదివారం ఎ.పి. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐ .టి..యు.ఆధ్వర్యంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా పలు నినాదాలు చేస్తూ జి. ఓ.కాపీలను దగ్ధం చేసారు. ప్రభుత్వం ఎన్ని జీవోలు తెచ్చిన తమ సమస్యలు పరిష్కరించే వరకు సమ్మెను కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హేమలత , ధనలక్ష్మి ,జలజాక్షి ,అరుణ ,మధురవేణి ,నిర్మల, ప్రమీల , సుదిష్ణ,శశివర్ణ పలువురు అంగనవాడీలు, హెల్పర్లు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

**రంగారెడ్డి జిల్లా,ఆమనగల్లు ప్రతినిధి,జనవరి 07,మనసాక్షి:**



సీఎం ఎనుముల రేవంత్ రెడ్డిని ఆదివారం డిసిసి అధికార ప్రతినిధి ఎంపీటీసీ ల సంఘం జిల్లా అద్యక్షుడు గూడూరు శ్రీనివాస్ రెడ్డి ఆమనగల్లు మాజీ జెడ్పిటిసి సభ్యుడు శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి మర్యాద పూర్వకంగా హైదరాబాద్ జూబ్లీహిల్స్ లోని ఆయన నివాసంలో కలిసి రేవంత్ రెడ్డికి పూల మాలలు శాలువాలతో సత్కరించారు. కల్వకుర్తి నియోజక వర్గం అభివృద్ధికి ప్రభుత్వ పరంగా సహకరించా లని సీఎం రేవంత్ రెడ్డి ని కొరగా సానుకూలంగా స్పందించి నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్థానికంగా నెలకొన్న పలు సమస్యలను సీఎం దృష్టికి తీసుకుపోయి నట్లు తెలిపారు.

# రోడ్డు ప్రమాదం...మిర్యాలగూడ వాసి మృతి

## వినోద్ భౌతికకాయాన్ని సందర్శించి భాస్కర్ రావు



**మిర్యాలగూడ టౌన్,జనవరి 7, మన సాక్షి:**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నెల్లూరు జిల్లాలోని గూడూరు వద్ద ఆదివారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో నల్లగొండ జిల్లాలో మిర్యాలగూడ నియోజకవర్గంలోని దామరచర్ల మండలంలోని తాళ్ళవీరప్పగూడెం గ్రామానికి చెందిన, టీఎస్ఆర్టీసీలో డ్రైవర్ గా పనిచేస్తున్న పోకల వినోద్ కుమార్ (29) మృతి చెందారు. వినోద్ భౌతిక కాయాన్ని బంధుమిత్రులు సందర్శనార్థం తాళ్ళవీరప్పగూడెంలోని నివాసం వద్ద ఉంచారు. స్థానిక నాయకుల ద్వారా సమాచారం తెలుసుకున్న మిర్యాలగూడ మాజీ శాసనసభ్యులు నల్లమోతు భాస్కర్ రావు వినోద్ భౌతిక కాయాన్ని సందర్శించి శ్రద్ధాంజలి ఘటించి పూలమాలతో నివాళి అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి వెంట నల్లగొండ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ దుర్గంపుడి నారాయణ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కుందూరు వీరకోటి రెడ్డి, నాయకులు అంగోతు హాతిరాం తదితరులు పాల్గొన్నారు.

# మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు పంపిణీ



**నల్గొండ,జనవరి7 మనసాక్షి:**

మహిళల స్వయం ఉపాధికి గుత్తా వెంకట్ రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ అండగా నిలిచింది. నల్గొండ పట్టణానికి చెందిన మహిళలు జననీ, మాతృశ్రీ సంస్థల్లో టైలరింగ్, బ్యూటీషియన్ ట్రైనింగ్ పొందిన వారికి కుట్టుమిషన్లు, బ్యూటీషియన్ కిట్లను గుత్తా వెంకట్ రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్, బీఆర్ఎస్ యువ నాయకులు గుత్తా అమిత్ రెడ్డి గారు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి గారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గుత్తా మాట్లాడుతూ మహిళలే ఇంటిల్లిపాదికి ఆధారమని, స్వశక్తితో వారు ఎదగాలనే సంకల్పం గొప్పదని అన్నారు. మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తూ గుత్తా వెంకట్ రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ పని చేస్తోందని గుత్తా అమిత్ రెడ్డి అన్నారు. మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్యం ఉంటేనే కుటుంబాన్ని ముందుకు నడపగలరని అన్నారు.

ఈ కార్యక్రమంలో కనగల్ జడ్పీటీసీ చిట్ల వెంకటేశం , స్థానిక కౌన్సిలర్ యామ కవిత దయాకర్, అభిమన్యు శ్రీనివాస్, బీఆర్ఎస్ సీనియర్ నేతలు యామ దయాకర్ , ఐతగోని స్వామి గౌడ్, గోపాల్ రెడ్డి, వెంకటేశ్వర రావు, హరికృష్ణ , ఇంద్రసేనా రెడ్డి , జగన్మోహన్ రావు, పరమేష్ , మాతృశ్రీ, జననీ శిక్షణ సంస్థల ఆర్గనైజర్ రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పట్టణ బిజెపి అధ్యక్షుని జన్మదిన వేడుకలు



**నారాయణపేట టౌన్, జనవరి 07 మనసాక్షి :-**

నారాయణపేట పట్టణ బిజెపి అధ్యక్షుడు మిర్చి వెంకటయ్య జన్మదిన వేడుకలను పార్టీ నాయకులు,అభిమానులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గొడుగు గేరి ఆంజనేయ. స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మిర్చి వెంకటయ్యను బిజెపి జిల్లా లీగల్ సెల్ కన్వీనర్ నందు నామాజీ,పట్టణ బిజెపి ప్రధాన కార్యదర్శి అపిరెడ్డి పల్లి రాము,గోవిందు గెరి లక్ష్మీకాంత్,ఉమాకాంత్,సంజీవ్ కుమార్ శాలువాలతో సన్మానించి మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు.

# కన్నుల పండుగగా లక్ష తులసి దళార్చన

**నేలకొండపల్లి, జూన్ 7 మన సాక్షి:**



మండల కేంద్రంలోని శ్రీ రాజగోపాలస్వామి దేవాలయం లో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ఆదివారం లక్ష తులసి దళార్చన కార్యక్రమం కన్నుల పండుగుగా జరిగింది. దేవాలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. లక్ష తులసి దళార్చన కార్యక్రమం ను తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వేదమంత్రోచరణ నడుమ... అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు మాట్లాడారు..... ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని...సకల జీవకోటి ఆనందంగా జీవించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పూజారి ముడుంబ రామానుజాచార్యులు. గ్రామ పెద్దలు గెల్లా మహేష్, అక్కినేని నాగేశ్వరరావు, నూతక్కి ప్రసాద్. కొత్తా రమేష్ -తదితరులు పాల్గొన్నారు.

# చేవెళ్ల పార్లమెంట్ బరిలో యువనేత కార్తీక్ రెడ్డి?

## ఐదు నియోజకవర్గాల్లో అపరచానిక్యుడిగా గుర్తింపు

**చేవెళ్ల: డిసెంబర్ 07 మన సాక్షి**

త్వరలో జరగనున్న పార్లమెంట్ సార్వత్రిక ఎన్నికల్లో చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గం నుండి యువ నాయకుడు పట్లోళ్ల కార్తిక్ రెడ్డికి అవకాశం కల్పించాలని నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుండి డిమాండ్ చేస్తున్నారు. స్థానిక నాయకులు, రంగారెడ్డి జిల్లా రాజకీయాలలో తనకంటూ చెరగని ముద్ర వేసుకున్న దివంగత నేత పట్లోళ్ల ఇంద్రారెడ్డి రాజకీయ వారసుడిగా రంగ ప్రవేశం చేసిన కార్తీక్ రెడ్డి కి బారాస పార్టీ నుండి ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కల్పించాలని పలువురు సీనియర్ నాయకులతో పాటు, యువజన విభాగం నాయకులు కోరుతున్నారు. ప్రధానంగా చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని రాజేంద్రనగర్, మహేశ్వరం, చేవెళ్ల, పరిగి, వికారాబాద్ శాసనసభ నియోజకవర్గాల్లో తనకంటూ తన అనుచర గణంతో ఓ గుర్తింపు తెచ్చుకున్నారు. మొన్న జరిగిన శాసనసభ ఎన్నికల్లో పై నియోజకవర్గతో పాటు జిల్లాలో బారాస అభ్యర్థుల గెలుపు కోసం తన వంతుగా కృషి చేశారు. గత 2014లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలిచిన కార్తీక్ రెడ్డి స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చవిచూశారు.

తిరిగి ఎన్నికలబరిలో నిలిచి విజయం సాధించాలని పట్టుదలతో పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో గ్రామస్థాయిలో పనిచేసినప్పటికీ మారిన రాజకీయ పరిస్థితుల్లో గత ఎన్నికల్లో టిఆర్ఎస్ అభ్యర్థి రంజిత్ రెడ్డిని బలపరిచారు. కార్తీక్ రెడ్డి తో పాటు ఆయన తల్లి సబితా ఇంద్రారెడ్డి, రంజిత్ రెడ్డి గెలుపులో కీలక పాత్ర పోషించారు. చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోనే కాకుండా రంగారెడ్డి జిల్లాలో ఇంద్రారెడ్డికి, సబితా రెడ్డికి ప్రత్యేకమైన గుర్తింపు వుంది. భారీ రాజకీయ అనుచరగణం ఉన్నారు. మరోవైపు గత ప్రభుత్వంలో సబిత ఇంద్రారెడ్డి మహేశ్వరం నియోజకవర్గం నుండి ఎన్నికై మంత్రిగా కొనసాగారు. ఇంద్రారెడ్డి ఓసారి విద్యాశాఖ మంత్రిగా, మరోసారి హెరీం శాఖ మంత్రిగా, కార్మిక శాఖ మంత్రిగా, నియోజకవర్గంతో పాటు రంగారెడ్డి జిల్లాకు సేవలు అందించగా

నబితా




ఇంద్రారెడ్డి సైతం గనులు భూగర్భవనరుల శాఖ మంత్రి గా, హెరీం మంత్రిగా, విద్యాశాఖ మంత్రిగా పలు పదవులు నిర్వహించి జిల్లాలో తిరుగులేని అనుచర గణాన్ని, అభిమానులను ఏర్పాటు చేసుకున్నారు. ఇంద్రారెడ్డి నాలుగు పర్యాయాలు ఎమ్మెల్యేగా విజయం సాధించగా ఆయన సతీమణి సబితా ఇంద్రారెడ్డి ఐదు సార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారు.

రాష్ట్ర రాజకీయాల్లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న వీరు రంగారెడ్డి జిల్లా రాజకీయాలను శాసించారు. వారి వారసుడిగా ఉన్న కార్తీక్ రెడ్డికి చేవెళ్ల పార్లమెంటు నుండి అవకాశం కల్పిస్తే తప్పకుండా విజయం సాధిస్తారని ప్రచారం జరగడంతో పాటు కార్తీక్ రెడ్డికే ఇవ్వాలని గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. మారిన రాజకీయాలు, ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండటంతో అధికార పార్టీకి దీటైన అభ్యర్థి ఇంద్రారెడ్డి కుటుంబమేనని పలువురు సీనియర్ నాయకుల సైతం తెలుపుతున్నారు. చేవెళ్ల నియోజకవర్గం లో బారాస గెలుపు కోసం పార్టీ అధిష్టాన వర్గం కార్తీక్ రెడ్డి అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని మెజార్టీ నాయకులు, కార్యకర్తలు కోరుతున్నారు. అయితే ఇటీవల జరిగిన శాసనసభ నియోజకవర్గ ఎన్నికల్లో చేవెళ్ల ఇన్చార్జిగా బాధ్యతలు తీసుకున్న కార్తీక్ రెడ్డి స్థానిక అభ్యర్థి కాలే యాదయ్య పై తీవ్ర వ్యతిరేకత ఉన్నప్పటికీ తన రాజకీయ చాణిక్యంతో ఆయన విజయానికి ఎంతో కృషిచేసి గెలిపించుకున్నారు. ఓవైపు మహేశ్వరం నియోజకవర్గంలో తన తల్లి సబితా ఇంద్రారెడ్డిని ఓడించేందుకు ఢిల్లీ నాయకులు వరుసగా బారులు తీరిన.... ఎక్కడ భయపడకుండా అటు మహేశ్వరం, ఇటు చేవెళ్ల నియోజకవర్గాల్లో అలుపెరుగని నాయకునిగా కృషి చేస్తూ గెలుపులో ప్రధాన భూమిక పోషించారు యువ నాయకుడు కార్తీక్ రెడ్డి. అంతేకాకుండా తాండూరు, వికారాబాద్, పరిగి, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి శాసనసభ నియోజకవర్గాల్లో మంచి పట్టు ఉన్నది. పిలిస్తే పలికే నాయకుడిగా పేరు ఉన్న కార్తీక్ రెడ్డికి అధిష్టాన వర్గం టికెట్ కేటాయిస్తే ఆయన భారీ మెజార్టీతో విజయం సాధిస్తారని అభిమానులు పేర్కొంటున్నారు.

# బ్యాంకుల ప్రైవేటైజేషన్ కు వ్యతిరేకంగా పోరాడిన అభినందనీయుడు



**సూర్యాపేట,జనవరి 07,మనసాక్షి:**

విశేషమైన తన సేవలతో ఇంటిపేరుకు బదులు బ్యాంకు శ్రీనుగా గుర్తింపు పొందిన నీల శ్రీనివాస్ ఆదర్శ జీవితాన్ని ప్రతి నాయకుడు స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్ అన్నారు. సూర్యాపేట ఎస్బిఐ మెయిన్ బ్రాంచ్ లో క్యాషియర్గా పనిచేస్తూ ఇటీవల పదవి విరమణ పొందిన నీల శ్రీనివాస్ దంపతులను సిపిఐ, ఏఐటియుసి ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ధర్మ విక్షం భవన్లో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బొమ్మగాని ప్రభాకర్ మాట్లాడుతూ కమ్యూనిస్టుతరం దోపిడీకి వ్యతిరేకంగా కడదాకా జండా మోసిందని ఆ తరానికి చెందిన నాయకుడు నీల విశ్వనాథం వారసుడిగా నీల శ్రీనివాస్ బ్యాంకుల ప్రైవేటైజేషన్కు వ్యతిరేకంగా పోరాటం చేశాడన్నారు. సూర్యాపేటలో పేటలో ఏ వీధికి వెళ్లిన సిపిఐ, ట్రేడ్ యూనియన్ లో లాభం పొందని కుటుంబం లేదన్నారు. దేశంలో లౌకిక లక్ష్యాలపై దాడి జరుగుతున్న క్రమంలో ప్రజాస్వామిక శక్తులను నిలబెట్టేందుకు శ్రీనివాస్ ఇంకా తన పాత్ర పోషించాలని అన్నారు.వామపక్ష భావాలు కలిగిన సంఘంలో ఉంటూ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఎనలేని పోరాటం చేసిన నీల శ్రీనివాస్ అభినందనీయుడు అన్నారు. తల్లిదండ్రులు ఆస్తులు ఇవ్వలేదని ఉద్యమ స్ఫూర్తిని మాత్రమే ఇచ్చారని ఆ ఉద్యమ స్ఫూర్తితో తన జీవితంలో వచ్చిన ఎన్నో ఒడిదుడుకులను తట్టుకొని నేడు అందరికీ ఆదర్శంగా నిలిచిన శ్రీనివాస్ స్ఫూర్తిని ప్రతి ఒక్కరు కొనసాగించాలన్నారు. కమ్యూనిస్టులు ఏ రంగంలో ఉన్న అందరికీఉపయోగపడేలా ఉంటారని అలాంటి వారే నీలా శ్రీనివాస్ అన్నారు.యూనియన్ పరంగా, బ్యాంకు ఉద్యోగిగా రాష్ట్ర జాతీయ స్థాయికి ఎదగడం మనందరం గర్వించే విషయం అన్నారు.నీల శ్రీనివాస్ ఇకముందు తన సమయాన్ని కుటుంబానికి, పార్టీకి కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.నీల శ్రీనివాస్ దంపతులను పూలమాలలు శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఏఐటీయూసీ నియోజకవర్గ గౌరవ అధ్యక్షులు చామల అశోక్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గన్న చంద్రశేఖర్, సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు,రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎల్లావుల రాములు, అనంతుల మల్లేశ్వరి,కే వి ఎల్, బొమ్మగాని శ్రీనివాస్, సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు నాయకులు, వెంకటేశ్వర్లు, దేగల జనార్ధన్, బొమ్మగాని నాగభూషణం, ఏఐటిసి జిల్లా అధ్యక్షులు రాజారా%శీ%, ఖమ్మంపాటి అంతయ్య, చివ్వెంల మండల కార్యదర్శి రాము, గోపగాని రవి,నిమ్మల ప్రభాకర్, శ్రీనివాస్,బూర రాములు, ఎన్.సి. సైదులు, రేగట్టి లింగయ్య,దీకొండ శ్రీనివాస్, పెంద్ర కృష్ణ, ఏ డెల్లి శ్రీకాంత్,బూర సైదులు, తదితరులు ఉన్నారు.

# ప్రజాపాలన దరఖాస్తుల నమోదు ప్రక్రియ వేగం పెంచాలి

## జిల్లా కలెక్టర్ ఎస్. వెంకట్రావ్.

**సూర్యాపేట,జనవరి 07,మనసాక్షి:**

ప్రజాపాలన దరఖాస్తుల ఆన్లైన్ ప్రక్రియలో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ ఎస్. వెంకట్రావ్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ప్రజాపాలనుకు సంబంధించి ఆదివారం రెండో రోజున నియోజక వర్గాలలోని మండలాలకు సంబంధించి జి.పి.లు అలాగే ఐదు మున్సిపాలిటీలకు సంబంధించి ఆన్లైన్ నమోదు ప్రక్రియ సంబంధిత కేంద్రాలలో శరవేగంగా ప్రత్యేక అధికారులు, వార్డు ఇంఛార్జీల సమక్షంలో డేటా ఎంట్రీ జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఎస్. వెంకట్రావ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం సాయంత్రం 6.00 వరకు 83322 దరఖాస్తులను ఆన్లైన్ డేటా ఎంట్రీ చేయడం జరిగిందని నిర్దేశించిన సమయానికి నిరంతర ప్రక్రియ కొనసాగుతుందని ఈ సందర్భంగా తెలిపారు.

# ప్రకృతి సేద్యం వైపు సాగుదాం

## భూమాతకు... గోమాతకు అవినాభావ సంబంధం



**మదనపల్లె, జనవరి 7. మన సాక్షి:**

రసాయనిక సేద్యం భూములను నిస్సారంగా మారుస్తుంది. ప్రకృతి సేద్యం భీల్లను సాగులోకి తెస్తుందని సైంటిస్టు, రిటైర్డ్ వైస్ చాన్సలర్ డాక్టర్ చౌడప్ప పేర్కొన్నారు. ఆదర్శ రైతు కొండా నరేంద్ర (యుఎస్ఎ) ఆధ్వర్యంలో ఆదివారం తంబళ్లపల్లె నియోజక వర్గం పీటీఎం మండలంలోని మదమూరు వద్దనున్న కొండా నరేంద్ర ఫామ్స్ లో వేల మందితో రైతు శిక్షణ శిబిరం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుండి స్వచ్ఛందంగా రైతులు తరలిరావడం విశేషం. సూపర్ సక్సెస్ అయ్యింది. ఈ సందర్భంగా జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ రసాయనిక ఎరువులు, పురుగు మందుల సేద్యంతో భూమి పనికి రాకుండా పోవడంతో పాటు వీటితో సాగు చేసిన ఉత్పత్తులు ఆరోగ్యాన్ని కూడా దెబ్బతీయిస్తుందన్నారు. ప్రకృతి వ్యవసాయంతో అటు భూములు ఇటు మనుషుల ఆరోగ్యం దారిలోకి వస్తుందన్నారు. ప్రకృతి వ్యవసాయంతో పెట్టుబడి కూడా తగ్గిపోతుందన్నారు. పెద్దల కాలంలో సేద్యం చేసే ప్రతి రైతు వద్ద పశు వులు ఉండేవన్నారు. ఎరువును వ్యవసాయానికి వాడేవారన్నారు. అందుకే భూమికి గోమాతకు అవినాభావం ఉండేదన్నారు. జాతీయ రైతు పురస్కార గ్రహీత వెంకట్రామణరాజు మాట్లాడుతూ ప్రకృతి సేద్యం ప్రగతి మార్గమన్నారు. ఈ సేద్యాన్ని ఉద్యమంగా చేపట్టాలన్నారు. సేంద్రీయ వ్యవసాయంతో ఖర్చు కూడా తక్కువన్నారు. శాస్త్రవేత్తలు గోపాల్రెడ్డి తదితరులు ప్రసంగించారు. కొండా నరేంద్ర మాట్లాడుతూ తాను కూడా ఉన్నత చదువులు చదివి అమెరికాలో వివిధ అగ్రశ్రేని కంపెనీలలో పనిచేసినప్పటికీ సేద్యంలో తృప్తి లభిస్తోందన్నారు. రైతుకు, వ్యవసాయానికి విలువ పెంచేలా వివిధ వ్యవసాయ పద్ధతులను ఈ ప్రాంతంలో అనుసరించేలా చూస్తానన్నారు. తాను త్వరలో క్రియాశీల రాజకీయాల్లోకి వస్తానన్నట్లు ప్రకటించారు. తన వంతు ప్రజలకు సేవలు అందిస్తానన్నారు. తాను టిడిపిలో ఉన్నానని ఇకనుండి చురుగ్గా క్రియాశీలకంగా రాజకీయాల్లో వ్యవహరిస్తానన్నారు. వివిధ ప్రజా సమస్యలపై పని చేస్తానన్నారు.

# జిల్లా టీఎస్ యుటిఎఫ్ మైనారిటీ గురుకుల జిల్లా కమిటీల ఎన్నిక

**నల్గొండ .జనవరి7 మన సాక్షి:**



టీఎస్ యుటిఎఫ్ మైనారిటీ గురుకుల నల్గొండ ఉమ్మడి జిల్లా ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనం ఎన్నిక జిల్లా యుటిఎఫ్ ప్రధాన కార్యాలయం లో జరిగింది.మైనారిటీ గురుకుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు మాట్లాడుతూ జిల్లా కమిటీ నిర్మాణం ద్వారా స్థానిక బలంతో దశల వారి కార్యక్రమం చేపట్టి సమస్యల పరిష్కారానికి పోరాడుతామని తెలిపారు. కార్యక్రమంలో టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి గారు ముఖ్య అతిధిగా పాల్గొని ఈ కమిటీల నిర్మాణంతో భవిష్యత్తు కార్యక్రమాలు మరియు మైనార్టీ గురుకుల వ్యవస్థ ఇతర సొసైటీలు ఒకే గొడుగు తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో టిఎస్ యుటిఎఫ్ టి ఎం ఆర్ ఈ ఐ ఎస్ మహేష్, నరసింహ గార్లు అన్ని జిలాల్లో సంఘ నిర్మాణ పనులు సమర్థవంతంగా నిర్వహించి ఉపాధ్యాయులు సమస్యల పరిష్కారానికి ముందుకు వెళతాం అని.తెలిపారు.సమావేశ కార్యనిర్వహణ బాధ్యులు నిర్వహించిన ఐక్య గురుకులాల వేదిక కన్వీనర్ పయ్యావుల భరత్ ఉపాధ్యాయులపై తగ్గించి ఉద్యోగాలను మనస్ఫూర్తిగా చేసే విధంగా పరిస్థితులు కల్పించడం అధికారుల బాధ్యత అని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా మైనారిటీ గురుకుల విభాగంలో ఎన్నిక జరిగింది.ఉమ్మడి నల్గొండ జిల్లా అధ్యక్షులు గా బొళ్ళెం కృష్ణ మూర్తి గారు, ప్రధాన కార్యదర్శి గా . ప్రసాద్, కోశాధికారిగా కోమటి రామకృష్ణ, ఉపాధ్యక్షుడు గా జ్యోతి బాబు, నూర్జహాన్, జిల్లా కార్యదర్శులు గా శంకర్, కె. రమాదేవి, అబ్దుల్ ముజీబ్, జంగయ్య, శ్వేత, అనిత మరియు ఉమ్మడి జిల్లా లో ఉన్నటువంటి మూడు జిల్లాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు కోశాధికారుల నియామకం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు జి. క్రాంతి కుమార్, బొల్లం కృష్ణమూర్తి, జిల్లా సమన్వయ కమిటీ సభ్యులు కొప్పుల జనార్ధన్, లక్ష్మణ్, వివిధ జిల్లాల మైనార్టీ గురుకులాల ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించిన నాయకులు



**మిర్యాలగూడ టౌన్,జనవరి 7, మన సాక్షి:**

దామరచర్ల మండల కేంద్రంలో సంక్రాంతి పండుగ సందర్భంగా ఉమ్మడి దామరచర్ల మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ను ముఖ్య అతిథులుగా పాల్గొని స్థానిక నాయకులు ప్రారంభించారు. స్థానిక నాయకులు మాట్లాడుతూ యువత క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలని అలాగే యువతరం దేశానికి వెన్నుముక అని స్థానిక మండలానికి చెందిన యువతరం అనేక రంగాలలో అభివృద్ధి చెందాలని అలాగే క్రీడలలో కూడా మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి అలాగే రాష్ట్ర స్థాయి వరకు టోర్నమెంట్లలో పాల్గొని గ్రామ మరియు మండల పేరును నిలబెట్టి అనేక గౌరవప్రదమైన సత్కారాలను పొందాలని అన్నారు.ఈ కార్యక్రమంలో దామరచర్ల మండలం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కందుల నరసింహారెడ్డి, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పడకపాటి కోటిరెడ్డి, దామరచర్ల గ్రామ సర్పంచ్ బంటు కిరణ్,ఆర్ఎస్ నాగిరెడ్డి, ఎంపిటిసి సోము సైదిరెడ్డి,ఎంపిటిసి బాల లక్ష్మీ సత్యనారాయణ, ఎస్ కే జానీ,గాలం మహేష్,బైరం శివ, సందాల శంబయ్య,సందాల లక్ష్మణ్, బి నాగరాజు,ఎస్ శేఖర్,బి శ్రీనివాస్ రెడ్డి, మన్యం బ్రదర్స్,నూకల అంజి, నిమ్మల విజయ్, వంశీ, సంజీవ, కాతోజు రమేష్, కోటచంద్రబాబు, ఆర్గనైజర్స్, తదితరులు పాల్గొన్నారు.

# వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



**నారాయణపేట టౌన్, జనవరి 07 మనసాక్షి :-**

జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఆదేశాల మేరకు ట్రాఫిక్ పోలీసులు జిల్లా కేంద్రంలోనీ సత్యనారాయణ చౌరస్తాలో ఆదివారం వాహనదారులకు, పెండింగ్ చాలాన్లపై, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ పోలీస్ తిరుపతి మాట్లాడుతూ వాహనాలకు పెండింగ్లో ఉన్న చాలన్స్ ను 10 వ తేదీ వరకు రాయితీ ఉన్నందున వెంటనే చెల్లించాలని, ప్రభుత్వం కల్పించిన రాయితీని అందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు అలాగే రోడ్డు ప్రమాదాల నివారణ కొరకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని తెలిపారు. వాహనదారులు తప్పకుండా ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడపరాదు, వాహనాలు నడిపేవారు విధిగా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించి వాహనాలు నడపాలన్నారు. రోడ్డుపై వాహనాలను పార్కు చేయరాదు. టూ వీలర్స్ పై ఇద్దరకు మించి ప్రయాణించరాదు. ఆటోలో సీట్ పర్మిట్ ఉన్నంతవరకే ప్యాసింజర్ ఎక్కించుకోవాలి.పరిమిత వేగంలో వాహనాలు నడపాలి. ప్రతి ఒక్కరు ట్రాఫిక్ రూల్స్ పాటించి పోలీస్ వారికి సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు తిరుపతి, భగవంతు, దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

# జహీరాబాద్ లోకసభ ఎన్నికల్లో నిశ్శబ్ద ఓట్లు బీజేపీకే

## మూడో సారి నరేంద్రమోడే భారత ప్రధాని: డీసీసీబీ మాజీ చైర్మన్ జైపాల్‌రెడ్డి



**అందోలు,జనవరి 07, మన సాక్షి**

రానున్నలోక్‌సభ ఎన్నికల్లో జహీరాబాద్ లోకసభ ఎన్నికల్లో నిశ్శబ్ద ఓట్లు అన్నీ భారతీయ జనతాపార్టీకి పోలవడం ఖాయమని ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ మాజీ చైర్మన్, బీజేపీ రాష్ట్ర నాయకుడు జైపాల్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో పది ఎంపీ స్థానాలకు పైగా బీజేపీ గెలుచుకుంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం జోగిపేటకు వచ్చిన సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ 8 అసెంబ్లీ స్థానాలను గెలుచుకోవడం జరిగిందని అన్నారు. జహీరాబాద్ లోకసభ పరిధిలోని అసెంబ్లీ స్థానాల్లో లక్షన్నరకు పైగా ఓట్లు సాధించామని, లోకసభ ఎన్నికల్లో బీజేపీ గెలుపొందడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నా, ప్రజలు మాత్రం బీజేపీ వైపు చూస్తున్నారన్నారు. గత పదేండ్ల క్రీతం దేశం ఆర్థికంగా 10వ స్థానంలో ఉండేదని, ప్రస్తుతం 5వ స్థానంలోకి చేరిందన్నారు. దేశ వ్యాప్తంగా 350కి పైగా లోక్ స్థానాలను బీజేపీ గెలుచుకుని,మూడవసారి బీజేపీ అధికారంలో రావడం ఖాయమని అన్నారు. బీజేపీ అధిష్టానం ఆదేశిస్తే జహీరాబాద్ ఎంపీ స్థానానికి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు సిద్దంగా ఉన్నానని డీసీసీబీ మాజీ చైర్మన్ జైపాల్‌రెడ్డి అన్నారు. జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోని ప్రజలకు మా కుటుంబానికి ఏనలేని బందం ఉందన్నారు. మా నాన్న దివంగత ఎం. బాగారెడ్డిని ఎంపీగా నాలుగు పర్యాయాలు జహీరాబాద్ లోకసభ పరిధిలోని ప్రజలు గెలిపించారని ఆయన గుర్తు చేశారు. పార్టీ అధిష్టానం పరిశీలనలో తన పేరు కూడా ఉందన్నారు. బీజేపీ సీనియర్ నాయకులు జగన్నాథం, సతీష్‌రెడ్డి, అప్సర్, విజయేందర్‌రెడ్డి, శివశంకర్ న్యాల్‌కల్ పీఏసీఎస్ మాజీ చైర్మన్ మోహన్‌రెడ్డి, తో పాటు తదితరులు ఉన్నారు.

# బీఆర్ఎస్ పార్టీ ఎంపీ ఎన్నికలలో సత్తా చాటుతుంది

**శంకర్‌పల్లి: జనవరి 07: మన సాక్షి:**



శంకర్‌పల్లి మండల పరిధి గోపులారం గ్రామ సర్పంచ్, రంగారెడ్డి జిల్లా సర్పంచుల సంఘం ఉపాధ్యక్షులు, అధికార ప్రతినిధి పొడవు శ్రీనివాస్ ఆదివారం తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ శ్రీవారి ఆశీస్సులతో గ్రామ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ తన సత్తాను చాటుతుందన్నారు.

# ఇంటింటికి అయోధ్య రాముడి అక్షింతల పంపిణీ

## - జై శ్రీరామ నినాదాలతో మారుమోగిన వాడవాడలు

**ఆందోల్, జనవరి 07, మన సాక్షి:-**



అయోధ్య శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ఆధ్వర్యంలో,అయోధ్య రాముడి అక్షింతలను పంపిణీ చేయాలని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర కమిటీ ఆదేశాల మేరకు అందోల్ మండలం కన్సాన్ పల్లి గ్రామంలో ఆదివారం శ్రీరామచంద్రమూర్తి యొక్క అక్షింతలను ఇంటింటికి పంపిణీ చేసే కార్యక్రమాన్ని భక్తులు చేపట్టారు.

ముఖ్యంగా బజరంగ్ దళ్ సభ్యులతోపాటు, గ్రామస్తులు, యువకులు పెద్ద సంఖ్యలో అక్షింతల పంపిణీ కార్యక్రమాల్లో స్వచ్ఛందంగా పాల్గొని,అయోధ్య శ్రీరామ జన్మభూమిలో నిర్మాణం అవుతున్న దివ్య మందిరం శుభ సంధర్భంగా ఇంటింటికి శ్రీరామ జన్మభూమి అక్షింతలను భక్తులు జై శ్రీరామ, జై సీతారామాంజనేయ అంటూ స్వాగతం పలుకుతూ మేళతాళాలతో పంపిణీ చేసే కార్యక్రమాన్ని ఆయా దేవాలయాల్లో పూజలు నిర్వహించి వీధులలో తిరుగుతూ జై శ్రీ రామ, జై జై సీతా రామ ఆంజనేయ అంటూ అక్షింతలను, శ్రీరామచంద్రమూర్తి జన్మభూమి మందిరం కరపత్రాలను భక్తులకు అందజేసి అక్షింతల ను పంపిణీ చేసే కార్యక్రమం నిర్వహించారు. అయోధ్యలో రామ మందిరం నిర్మాణం జరిగి తీరాలనే హిందువుల ఆకాంక్ష సిద్ధించింది. రామ మందిర నిర్మాణమే హిందువుల స్వాభిమాన సంకేతమని, అయోధ్య నుంచి వచ్చిన శ్రీరాముడి అక్షింతలు, రాములవారి చిత్రపటం, మందిరం నమూనా కరపత్రం, ప్రతి ఇంటికి అందజేసేందుకు సర్వం సిద్ధం చేశామని వివరించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రతి హిందువును ఈ మహా యజ్ఞంలో భాగస్వామ్యం చేసేందుకు వ్యవస్థ తయారైందని చెప్పారు

జనవరి 22న మధ్యాహ్నం 12 :30 నిమిషాలకు అయోధ్యలో జరిగే విగ్రహ ప్రాణప్రతిష్ట మహొత్సవాన్ని దూరదర్శన్ ద్వారా టీవీ లైవ్ లలో అందరూ వీక్షించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. సాయంత్రం పంచభూతాలను ఆహ్వానిస్తూ కనీసం ఐదు దీపాలను వెలిగించి ప్రతి ఇంటిలో దీపావళి చేసుకోవాలని సూచించారు. ఆభాల గోపాలం ఈ మహా యజ్ఞంలో పాల్గొనాలని శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ విజ్ఞప్తి చేస్తుంది అని తెలిపారు.

మొదటగా అయోధ్య రామ అక్షింతలను దుర్గ భవాని ఆలయంలో ఉంచి పూజలు నిర్వహించిన అనంతరం హనుమాన్ దేవాలయం వరకు ఊరేగింపుగా వెళ్లి అక్కడ మందిరంలో పూజలు చేపట్టారు. అట తరువాత భక్తులు అక్షింతలను ఇంటింటికి పంపిణీ చేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో దత్తాశ్రమ పీఠాధిపతి కృష్ణ మహారాజ్, బిజెపి పార్టీ అధ్యక్షుడు వని రమేష్, కిసాన్ సెల్ అధ్యక్షుడు కాల్వ మీది రమేష్, కురుమ సంఘం నియోజకవర్గ నాయకులు డాక్టర్ సంగమేశ్వర్, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు మొరబోయిన కృష్ణ, కె.సురేష్ రావు, ఆర్ఎంపి వైద్యుడు కాడెం మచ్చేందర్, బజరంగ్ దళ్ నాయకులు కాడెం శ్రీనివాస్, కె.గోపాల్, కె.నాగభూషణం, జి.ప్రకాశం,దత్తయ్య, డి.మాణిక్యం, శ్రీరాములు,సిహెచ్. పాపయ్య,పి. నవీన్, రాజు,డి. ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**మర్రిగూడ, జనవరి 7 మన సాక్షి:**

నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలోని శివన్న గూడ గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాల 1989–1990 బ్యాచ్ పదవ తరగతి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సుమారు 34 ఏళ్ల తర్వాత ఒకరికొకరు కలుసుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు పూర్వవిద్యార్థులంతా కలిసి జ్ఞాపికలను అందజేసి, సన్మానం చేశారు. ఈ సందర్భంగా గురువులు కుంభ మదన్ రెడ్డి, సోమారెడ్డి, లాల్ నాయక్ ప్రసంగించారు. ఆనాడు (1990) పుస్తకాల్లో పాఠాలను నేర్పిన గురువులు, నేడు తమ ప్రసంగంలో బతుకు తాలుకు పాఠాలు, తమ అనుభవాలను రంగరించి, అందరికి అర్థమయ్యేలా బోధించారు. వాటిల్లో ముఖ్యంగా తల్లిదండ్రులను గౌరవించాలని, వృద్ధాశ్రమంలో వారిని చేర్పించకూడదని, చివరాంకంలో తల్లిదండ్రులను ప్రేమ చూడాలని వారు సూచించారు.పూర్వ విద్యార్థులు తమ పిల్లలకు మంచి నడవడిక నేర్పించాలని, ఈ పోటీ ప్రపంచంలో తట్టుకుని నిలబడేలా వారిని తీర్చిదిద్దాలని వివరించారు. అంతేకాకుండా ఆరోగ్యమే మహాభాగ్యమని, ఆ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని వారు బోధించారు. రోజూ వ్యామయం, యోగా లాంటివి, చేసి, రోగాలను దూరంగా ఉండాలని వారు వివరించారు. ఒక్కో గురువు బడిలో చెప్పని బతుకు పాఠాలను తమ ప్రసంగంలో రంగరించి, పూర్వ విద్యార్థులందరికి అర్థమయ్యేలా వివరించారు. అంతేకాకుండా గురువులు ఈ ఆత్మీయ సమ్మేళనంలో తాము ఈ పాఠశాలలో ఎదుర్కొన్న కొన్ని సంఘటనలు, వాటి ద్వారా జరిగిన పరిణామాలను గుర్తు చేసుకున్నారు. 34 ఏళ్ల తర్వాత తమందరిని గుర్తు పెట్టుకుని, ఆత్మీయ సమ్మేళనానికి ఆహ్వానించడం, చాలా సంతోషంగా ఉందని ఆనందాన్ని వ్యక్తం చేశారు.

అంతకుముందుకు 1989–90 బ్యాచ్ పూర్వ విద్యార్థులంతా అలనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ తాము చదువుకున్న రోజులలో కొన్ని జ్ఞాపకాలు గుర్తు వేసుకుంటూ ఒక్కొక్కరు గడిచిన 34 ఏళ్లుగా ఏమి పని చేశారు. ఎంత వరకు చదువుకున్నారు. విద్య, ఉద్యోగం, కుటుంబం, పిల్లలు, బరువులు, బాధ్యతలు వంటి అంశాలపై మాట్లాడారు.34 ఏళ్ల సుదీర్ఘ సమయం తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థుల ముఖాల్లో ఆనందం, సంతోషమనే వెలుగులు కనిపించాయి. పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేయాలనే పెద్ద టాస్క్ని చేయడం చాలా కష్టంతో కూడుకున్న పని అని, అందరి అడ్రసులు, ఫోన్ నంబర్లు సేకరించి, అది సుదీర్ఘ కాలం (34ఏళ్లు) తర్వాత అందరిని కలుపుకుని గెట్ టు గెదర్ ని విజయవంతం చేయడం మామూలు విషయం కాదని గురువులు కితాబిచ్చారు. కొంత మంది పూర్వ విద్యార్థులు కలిసి ఈ కార్యక్రమాన్ని భుజానికి వేసుకుని ఇంత ఖర్చు పెట్టుకుని ఈ కార్యక్రమాన్ని సక్సెస్ చేయడం, ఎక్కడెక్కడో వున్న మా టీచర్లందరిని ఒకే వేదికపైకి తీసుకురావడం సంతోషంగా ఉందని వారు చెప్పుకొచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిట్యాల సవిత యాదగిరి రెడ్డి, మాజీ సర్పంచ్ చెరుకు లింగం గౌడ్, పెద్దలు సిరి ప్రగడ ఆనందరావు, రాపోలు యాదగిరి చిట్యాల రంగారెడ్డి, పూర్వ విద్యార్థులు వంగాల యాదగిరి రెడ్డి, శ్రీశైలం ,ముడిగ నరసింహ, బోడ వెంకటయ్య , ముడిమాలపు శ్రీను ,వెంకట్ రెడ్డి, నర్మదా, ధనమ్మ ఎల్ వెంకటయ్య, వేణు సమ్మారెడ్డి, శ్రీను, అయితగోని వెంకటయ్య పెంటాజీ , నాగబండి నరసింహ, నక్క యాదయ్య, బన్సీలాల్ మహేందర్, అజ్మత్ అలీ పాల్గొన్నారు.

# పుట్టినరోజు వేడుకల్లో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి



**రంగారెడ్డి జిల్లా,ఆమనగల్లు జనవరి 07 మనసాక్షి:**

ఆమనగల్లు పట్టణంలోని బిఎన్ఆర్ గార్డెన్లో కండే సుమన్ చంద్రిక కుమార్తె కీర్తికా మొదటి పుట్టిన రోజు వేడుకలో ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి పాల్గొన్నారు.అనంతరం కసిరెడ్డి నారాయణ రెడ్డి చిన్నారిని ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జగన్,శి వలింగం,కృష్ణ, కేఎన్ఆర్ యూవసేన వ్యస్థాపక అధ్యక్షుడు మెకానిక్ బాబా, కేఎన్ఆర్ యూవసేన జిల్లా నాయకుడు విజయ్ రాథోడ్, భాస్కర్,సురేష్,శ్రీనివాస్, నజర్,పాల్గొన్నారు.

# అధికారం లేదని బాధపడాల్సిన అవసరం లేదు

## ప్రతి క్షణం అందుబాటులో ఉంటా



**దమ్మపేట రూరల్, జనవరి 07 మన సాక్షి :**

అశ్వారావుపేట నియోజకవర్గం దమ్మపేట మండలం), తాటిసుబ్బన్నగుడెంలోని అశ్వారావుపేట నియోజకవర్గ మెచ్చా నాగేశ్వరరావు నివాసంలో దమ్మపేట మండల బిఆర్ఎస్ పార్టీ సమావేశం జరిగింది.ఈ సందర్భంగా కార్యక్రమంలో మెచ్చా నాగేశ్వరరావు మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో సైనికుడిలా పని చేసిన ప్రతి ఒకరికి కృతజ్ఞతలు తెలిపారు.అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ బిఆర్ఎస్ పార్టీననీ.10సం.లు పాలించిన బిఆర్ఎస్ పార్టీ ఎంతో చేసినప్పటికీ.అమలు కానీ హామీలు చెప్పి ప్రజలను నమ్మబలికారని అదే క్రమంలో ప్రజలు కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ఎదో చేస్తదని నమ్మారని ఫలితంగా నేడు చూస్తున్నామని.కేసీఆర్ ఉన్నపుడు టింగ్ టింగ్ అంటూ రైతు బంధు పడేది కానీ నేడు రైతు బంధు ఎవరికీ పడిందో తెలియని అయోమయంలో ఉన్నారని ప్రజల్లో వేతిరేకత మొదలైందని.అయినప్పటికీ ప్రజలు ఇచ్చిన తీర్పును అంగీకరించి ప్రతిపక్షంగా ఉంటు ప్రజల తరుపున పోటీ చేద్దామని.అధికారం లేదని ఏ కార్యకర్త అధైర్య పడాల్సిన అవసరం లేదని అండగా ఉంటానని కంటికి రెప్పలా కాపాడుకుంటానని.భవిష్యత్తు మళ్లీ మనదేనని రాష్ట్రంలో ఎప్పుడు ఎదైన జరగవచ్చని కేసీఆర్ బయటకి వేస్తే అనేక మార్పులు జరుగుతాయని భయపడాల్సిన అవసరం లేదని..కాంగ్రెస్ వారు అప్పుడే దాడులు దందాలు మొదలుపెట్టారని.వారిలో వారికే వర్గాల గొడవలు జరుగుతాయని.అలాగే కొంతమంది నాయకులు కార్యకర్తలు ఓటమి వల్ల కొంచం ఇబ్బందీ పడుతున్నారని ఆ అవసరమే లేదని మెచ్చా నాగేశ్వరరావు అనే వ్యక్తి బ్రతికి ఉన్నన్ని రోజుకు హుందాగా రాజకీయాలు చేస్తానే కానీ తల దించుకునే రాజకీయం ఏనాడూ చేయనని.మనం అధికారంలో ఉన్నపుడు ఏ పార్టీ అని చూడకుండా అన్ని పార్టీల వారికి పథకాలు అమలు చేశామని కానీ నేడు కాంగ్రెస్ ప్రభుత్వంలో కాంగ్రెస్ వారికే ముందు ఇస్తారు అంట మిగితా వారికి ఉండవని అంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి,జెడ్పీటీసీ,ఎంపీటీసీ లు,సర్పంచ్ లు,ఉప సర్పంచ్ లు,మండల నాయకులు,గ్రామ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు,కార్యకర్తలు,యువజన నాయకులు,పాల్గొన్నారు.

# వైభవంగా ' మల్లన్న ' కల్యాణోత్సవం..!

## పాల్గొన్న పలువురు మంత్రులు

**దుబ్బాక, జనవరి 07, మనసాక్షి :**



కోరమీసాల దేవుడు, కొమురవెల్లి మల్లన్న కల్యాణం కమనీయంగా ఆదివారం జరిగింది. ఆగమశాస్త్ర సంప్రదాయం ప్రకారం మల్లికార్జునస్వామి బలిజ మేడాలమ్మ, గొల్ల కేతమ్మలను పెళ్లాడాడు. కొమురవెల్లి ఆలయ ప్రాంగణంలోని తోటబావి వద్ద కన్నులపండువగా జరిగిన ఈ వేడుకను చూసేందుకు వేలాది మంది భక్తులు తరలివచ్చారు. ప్రభుత్వం తరపున దేవాదాయ, జిల్లా ఇంచార్జ్ మంత్రి కొండా సురేఖ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, జనగామ డీసీసీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డి ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. ఉజ్జయిని పీఠాధిపతులు శ్రీ1008 జగద్గురు సిదలింగరాజదేశి కేంద్ర శివాచార్య మహా స్వామీజీ పర్యవేక్షణలో మల్లికార్జున స్వామి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మంది భక్తులు ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ అధికారులు, స్థానిక నాయకులు, భక్తులు తో పాటు పలువురు పాల్గొన్నారు.



# సమస్యలపై సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు వినతి



**మిర్యాలగూడ టౌన్, జనవరి 7, మన సాక్షి:**

మిర్యాలగూడ పట్టణ, మండలంలో నెలకొన్న కొన్ని సమస్యలపై వివరిస్తూ సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ మిర్యాలగూడ పట్టణ అధ్యక్షులు గాయం ఉపేందర్ రెడ్డి తో కలిసి మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్ ను ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. సిపిఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటేశ్వర్లు మండల కార్యదర్శులు ఎండి సయ్యద్, జిల్లా యాదగిరి, గూగుల యాదగిరి, వలపట్ల వెంకన్న, గువ్వల అంజయ్య, అంజన్న, పెల్లి రామలింగం, దాసర్ల దుర్గమ్మ ,ఎస్కే షమీం ,ఎర్రబోతు పద్మ ,ధీరవత్ శాంతమ్మ ,ఎర్ర ప్రమీల, రాములు ,పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభాకర్ రావు మృతి పద్మశాలి సమాజానికి తీరని లోటు



**మిర్యాలగూడ టౌన్, జనవరి 7, మన సాక్షి:**

తెలంగాణా రాష్ట్ర పద్మశాలి సంఘం అధ్యక్షుడు,విశ్రాంత తహాశీల్దార్ మచ్చ ప్రభాకర్ రావు అకాల మృతి పద్మశాలి సమాజానికి తీరని లోటు అని మిర్యాలగూడ బీసీ జెఎసి కన్వీనర్ మరం శ్రీనివాస్, ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రాపోలు పరమేష్ లు అన్నారు.ప్రభాకర్ హైదరాబాద్ లో ఆదివారం తెల్లవారు ఝామున హఠాత్తుగా గుండెపోటు తో మృతి చెందారు.ఈ సందర్భంగా మిర్యాలగూడ అమరవీరుల స్థూపం వద్ద బీసీ జెఎసి ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాలులర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పద్మశాలి సమాజాన్ని చైతన్య పర్చడానికి ప్రభాకర్ రావు ఎంతో కృషి చేశారని అన్నారు.ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు పున్నా రాములు, నాయకులు తిరందాస్ విష్ణు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు పోలగాని వెంకటేశ్వర్లు గౌడ్ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గాదగోని మహేష్,రాష్ట్ర నాయకులు ఋషికేశ్వర్ రాజు, శ్రీనివాస్ తదతరులు పాల్గొన్నారు.

# అయోధ్య రాముని అక్షింతలు పంపిణీ కార్యక్రమం



**మర్రిగూడ, జనవరి 7, మన సాక్షి:**

అయోధ్య రాముని అక్షింతల పంపిణీ కార్యక్రమం ఆదివారం మర్రిగూడ మండలంలోని తమ్మడపల్లి గ్రామంలో ఘనంగా నిర్వహించారు, కలశాన్ని ఊరేగింపుగా రామ నామాన్ని స్మరించుకుంటూ భజన చేసుకుంటూ భక్తిశ్రద్ధలతో గ్రామస్తులు గ్రామంలో అయోధ్య రామ జన్మభూమి కలశ. స్పర్శ అక్షింతలు గ్రామ పెద్దలు సమక్షంలో ఇంటి ఇంటికి అక్షింతలు పంపిణీ చేయడం జరిగింది.... ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లక్ష్మీ నరసింహ, మేకల జగన్ రెడ్డి, మేకల గోవర్ధన్ రెడ్డి, మల్ రెడ్డి నరసింహారెడ్డి, కొట్టం మల్లేష్ ఉప సర్పంచ్, కొట్టం శ్రీనివాస్ యాదవ్, ఆకుల గిరి ప్రసాద్, కొట్టం జలంధర్, ఆకుల సాయికుమార్, దేరంగుల సత్యం, వట్టి కోటి రాము, మొగిలి శివ, శివ గౌడ్, కొట్టం శీను, తదితరులు పాల్గొన్నారు.

# మహాత్మ భూమ్మిండేశ్వర మహారాజ్ వార్షికోత్సవం

## పాల్గొన్న ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి

**కంగ్టి, జనవరి 07,మన సాక్షి :-**



సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ పట్టణంలోని 5వ వార్డ్ భూమ్మిండేశ్వర చౌక్ మొదటి వార్షికోత్సవం వేడుక సందర్భంగా ఖేడ్ భూమ్మిండేశ్వర ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మొదటి వారోత్సవాలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భూమ్మిండేశ్వర అడుగుజాడల్లో ప్రతి ఒక్కరు నడవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బాపు మల్శెట్టి యాదవ్, మాజీ సర్పంచ్ కిష్టయ్య మాస్టర్, నరేష్ యాదవ్,పండరి రెడ్డి, మారుతి యాదవ్, మోహన్, ప్రభాకర్ రెడ్డి, రమేష్ చౌహాన్, నర్సింలు, గోపాల్,సంజీవ యాదవ్, నరసప్ప, రాజు, బొంగుండేశ్వర ఉత్సవ సమితి సభ్యులు పెద్ద పెద్ద ఎత్తున తదితరులు పాల్గొన్నారు.